

తెలంగాణ హెరాల్డ్

ప్రతి వార్త సంచలనం



హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 250 ఆదివారం 11 అక్టోబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-

వన్ నేషన్ -వన్ ఎడ్యుకేషన్



బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని

ప్రజలు నమ్మలేదు

మంత్రి పొంగులేటి



● గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం 21 శాతానికి పైగా పెరిగిందన్న పొంగులేటి ● ఇదే రేవంత్ రెడ్డి సమర్థ పాలనకు నిదర్శనమని వ్యాఖ్య ● పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని భూ అక్రమాలను వెలికితీస్తున్నామని వెల్లడి 2

భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి

ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి



ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టీకరణ

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ అనంతరం ప్రకటన

ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి 2

'సర్'పై కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టాలి..

బీజేపీ నేతలకు రాంచందర్‌రావు పిలుపు



'సర్' (ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ-ఎస్ఐఆర్) ప్రక్రియ పై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు, వివిధ సెల్స్ కన్వీనర్లు, - మిగతా2లో

బేబీ రుక్సానాకు మెరుగైన వైద్యం, ఆమె తల్లికి ఉద్యోగం కల్పిస్తాం



గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బేబీ రుక్సానా ఆరోగ్య పరిస్థితిపై తెలంగాణ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆరా తీశారు. మంత్రి ఆదేశాలతో ఆయన కార్యాలయ అధికారులు శనివారం ఉదయం గాంధీ హాస్పిటల్‌కు వెళ్లి పాప, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. - మిగతా2లో

ఢిల్లీలో నిర్బంధం పై కేంద్ర ప్రభుత్వం పై సీపీఐ నారాయణ ఫైర్



సీపీఐ సీనియర్ నేత నారాయణ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో పూర్తిస్థాయి లాక్‌డౌన్ విధించారని, ఇంతకీ ఢిల్లీని పాకిస్థాన్‌కు ఏమైనా అప్పగించారా అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేశారు.

- మిగతా2లో

కాక్రోచ్ పార్టీ నిరసనల బాధ్యతలు

అజింక్య షిండే చేతికి..

35 ఏళ్ల షిండే కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్

గతంలో పుణెలో ఐటీ ఉద్యోగిగా పనిచేసిన షిండే

ఆగస్టులో సీజేపీ జాతీయ బృందంలోకి షిండే 2



చైనాలో ఒకేసారి 196

పార్కింగ్ స్లాట్లు కొన్న మహిళ

చైనాలో ఒక మహిళ తన ముందుచూపుతో చేసిన పెట్టుబడి ఆమెను కోటీశ్వరురాలిని చేయడమే కాకుండా , స్థానిక నివాసితులతో తీవ్ర వివాదానికి, తదనంతరం న్యాయపోరాటానికి దారితీసింది. అయితే, ఈ కేసును విచారించిన న్యాయస్థానం చివరకి ఆమెకే అనుకూలంగా తీర్పునివ్వడం గమనార్హం. హునాన్ ప్రావిన్స్‌లోని చాంగ్షా నగరంలో 2018లో ఒక రెసిడెన్షియల్ ప్రాజెక్టు పూర్తయింది.

- మిగతా2లో



వన్ నేషన్ -వన్ ఎడ్యుకేషన్











తెలంగాణలో విద్యావిధానాల లోపాలపై సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెహెల్కా పత్రిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య,ఆకునూరి మురళి ,చిరంజీవి ఐఏఎస్‌లు ప్రొపెసర్ కాశిమ్ , ప్రభుత్వ అడ్వైజర్ వి .హనుమంత రావు, తెలంగాణ విఠల్ ,ప్రొపెసర్ వెంకటదాస్, ప్రొపెసర్ తిరుపతి దికొండ, డాక్టర్ పర్వతం వెంకటేశ్వర్ ,పాపని నాగరాజు, నిర్వాహకులు తెహల్క ఎడిటర్ చంద్రశేఖర్ ప్రసంగించారు .ఈ సమావేశంలో మాట్లాడిన అంశాలు రాష్ట్రములోని ఎడ్యుకేషన్ హక్కు కాదు వ్యాపారంగా మారిపోయింది .అన్ని ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం ఉచిత విద్యపై చట్టపరంగా పోరాటం చేయాలి అని ఈ సమావేశం నిర్ణయిం చింది . తెలుగు ,హిందీ ,ఇంగ్లీష్ లో బాషా పై పట్టు లేనందున ప్రాథమిక పాఠశాల లోనే బాషా పండితు లను నియమించాలి. మెరుగైన వసతులు, నిధులు: పాఠశాలల్లో మరియు కళాశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని, శిథిలావస్థకు చేరిన భవనాలను బాగు చేయాలి. తరగతుల్లో తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడం, ఖాళీలను భర్తీ చేయాలి. విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా తరగతి గదులు లేవు .

భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి

హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం ఈ వివరాలను కిషన్ రెడ్డి ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. “రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా చట్టవిరుద్ధం” అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం. మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది. ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన ‘కవచ్’ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు.

‘సర్’ పై కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టాలి.. బీజేపీ నేతలకు రాంచందర్‌రావు పిలుపు

‘సర్’ (ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ--ఎస్ఐఆర్) ప్రక్రియ పై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు, వివిధ సెల్స్ కన్వీనర్లు, అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవాలు లేవని, క్షేత్రస్థాయిలో ప్రజలకు వాస్తవాలను వివరించాలని సూచించారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన

సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించిందని రాంచందర్‌రావు పేర్కొన్నారు. బోగస్ ఓట్ల తొలగింపు ప్రక్రియ పై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను ఆయన ఖండించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు.

‘ఓట్ చోరీ’ ప్రచారాన్ని ఎండగట్టాలి

వరుస ఎన్నికల్లో ఎదురైన ఓటములతో కాంగ్రెస్ నేతలు రాజ్యాంగబద్ధ సంస్థలపై విమర్శలు చేస్తున్నారని రాంచందర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ చేస్తున్న ‘ఓట్ చోరీ’ ప్రచారాన్ని ప్రజల్లో ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా వల్ల ప్రజాస్వామ్యానికి కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

ఢిల్లీలో నిర్బంధంపై కేంద్ర ప్రభుత్వం పై సీపీఐ నారాయణ ఫైర్

సీపీఐ సీనియర్ నేత నారాయణ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో పూర్తిస్థాయి లాక్‌డౌన్ విధించారని, ఇంతకీ ఢిల్లీని పాకిస్థాన్‌కు ఏమైనా అప్పగించారా అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వచ్చిన వారిని అణచివేసేందుకు 50 వేల నుంచి 75 వేల మంది పోలీసు, ఇతర భద్రతా సిబ్బందిని మోహరించి సాధారణ జనజీవనాన్ని స్తంభింపజేయడం అన్యాయమని అన్నారు. కేంద్రం తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్రం పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారైందని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలపై న్యాయ నిపుణులు, సుప్రీంకోర్టు కూడా స్పందిస్తున్నాయని గుర్తుచేశారు. ఇదే సమయంలో, తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్ విజయం సాధించడంపై నారాయణ సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఈ ఎన్నికలను కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా రాజకీయ పోటీగా మార్చిన కాంగ్రెస్ పార్టీపై ఆయన విమర్శలు గుప్పించారు. అధికార అహంకారంతో కమ్యూనిస్టులను ఓడించాలని పిలుపునివ్వడం సరికాదన్నారు. ప్రజల ఉద్యమాలను అణచివేతతో ఆపలేరని, కేంద్రం తన తప్పులను సరిదిద్దుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు.

చైనాలో ఒకేసారి 196 పార్కింగ్ స్లాట్లు కొన్న మహిళ

చైనాలో ఒక మహిళ తన ముందుచూపుతో చేసిన పెట్టుబడి ఆమెను కోటీశ్వరురాలిని చేయడమే కాకుండా, స్థానిక నివాసితులతో తీవ్ర వివాదానికి, తదనంతరం న్యాయపోరాటానికి దారితీసింది. అయితే, ఈ కేసును విచారించిన న్యాయస్థానం చివరకి ఆమెకే అనుకూలంగా తీర్పునివ్వడం గమనార్హం. హునాన్ ప్రావిన్స్‌లోని చాంగ్షా నగరంలో 2018లో ఒక రెసిడెన్షియల్ ప్రాజెక్టు పూర్తయింది. అప్పట్లో ఆ ప్రాంతంలో పాఠశాలలు, మార్కెట్లు, రవాణా సౌకర్యాలు తగినంతగా లేకపోవడంతో ఫ్లాట్లు లేదా పార్కింగ్ స్థలాలు కొనుగోలు చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు. అయితే, ‘వు’ అనే మహిళ స్థానిక ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలను లోతుగా అధ్యయనం చేసి, ఆ ప్రాంత భవిష్యత్తును ముందుగానే అంచనా వేశారు. ఆ సమయంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న డెవలపర్‌తో సంప్రదింపులు జరిపి, ఏకంగా 196 పార్కింగ్ స్లాట్లను 14 మిలియన్ యువాన్లకు (సుమారు రూ. 20 కోట్లు) ఒకేసారి కొనుగోలు చేశారు. ప్రాజెక్టులోని మొత్తం పార్కింగ్ స్థలాల్లో ఇది 40 శాతం కావడం విశేషం. ఆమె ఊహించినట్టుగానే కొన్నేళ్లలో ఆ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందింది. ఫ్లాట్లన్నీ అమ్ముడయ్యాయి. దీంతో పార్కింగ్ స్థలాలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా భావించిన వు, తన స్థలాలను ఇతరులు వాడకుండా పార్కింగ్ లాక్స్ ఏర్పాటు చేశారు. గతంలో డెవలపర్ నెలకు సుమారు రూ. 3,600గా నిర్ణయించిన అద్దెను, ఆమె ఏకంగా రూ. 7,258కి పెంచేశారు. కొన్ని స్లాట్లను ఒక్కొక్కటి అసలు ధర కంటే 80 శాతానికి ఎక్కువకు విక్రయానికి ఉంచారు. వు నిర్ణయంతో ఆగ్రహానికి గురైన స్థానికులు, అద్దె తగ్గించాలని కోరినా ఆమె అంగీకరించలేదు. ప్రభుత్వ అధికారులు మధ్యవర్తిత్వం వహించినా ఫలితం లేకపోయింది. దీంతో కొందరు నివాసితులు కలిసి కోర్టును ఆశ్రయించారు. పార్కింగ్ స్థలాలు నిత్యావసర సౌకర్యాలని, వాటిని ఒకే వ్యక్తి గుత్తాధిపత్యం చేసి లాభాలు ఆర్జించడం సరికాదని వాదించారు. వు, డెవలపర్ మధ్య జరిగిన ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కేసును విచారించిన చాంగ్షా కోర్టు, ఈ ఏడాది ఫిబ్రవరిలో వుకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ప్రాజెక్టు అమ్మకానికి పెట్టినప్పుడు పార్కింగ్ స్థలాలు కొనుగోలు చేసే అవకాశం నివాసితులందరికీ ఉందని, కానీ వారు ఆ హక్కును వినియోగించుకోలేదని కోర్టు పేర్కొంది. వు మాత్రం మార్కెట్ రిస్క్ తీసుకుని, సొంత నిధులతో పెట్టుబడి పెట్టారని స్పష్టం చేసింది. ఒక వ్యక్తి ఎన్ని పార్కింగ్ స్థలాలైనా కొనుగోలు చేయవచ్చని, దీనిపై చట్టపరమైన పరిమితులు ఏవీ లేవని పేర్కొంది.

బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు

తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై విశ్వాసం ఉంచారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఆయన ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 21.86 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. ఈ గణాంకాలే ప్రభుత్వ పనితీరుకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనా సామర్థ్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం భూములపై బీఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలను, ఆరోపణలను ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూ అక్రమాలను తమ ప్రభుత్వం వెలికితీస్తోందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, ప్రజలకు వివాదరహిత భూములను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.

బేబీ రుక్సానాకు మెరుగైన వైద్యం, ఆమె తల్లికి ఉద్యోగం కల్పిస్తాం

గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బేబీ రుక్సానా ఆరోగ్య పరిస్థితిపై తెలంగాణ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆరా తీశారు. మంత్రి ఆదేశాలతో ఆయన కార్యాలయ అధికారులు శనివారం ఉదయం గాంధీ హాస్పిటల్‌కు వెళ్లి పాప, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్, డాక్టర్ ఉషారాణితో మంత్రి ఫోన్‌లో మాట్లాడి పాప ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పాపకు పుట్టుకతోనే పెద్ద పేగు సమస్య ఉందని, ఈ సమస్యకు చిన్నారికి పుట్టినప్పుడే నీలోఫర్‌లో సర్జరీ చేశారని ఉషారాణి తెలిపారు. ఇటీవలే గాంధీలో పాపకు మరో సర్జరీ జరిగిందని, మరో మూడు నెలల తర్వాత ఇంకొక సర్జరీ చేయాల్సి ఉందని ఆమె వివరించారు. చిన్నారికి చికిత్స విషయంలో ఎలాంటి సమస్య లేదని తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. కుటుంబ కలహాలు, ఆర్థిక పరిస్థితుల వల్లే రుక్సానా తల్లి ఈ కఠిన నిర్ణయం తీసుకుందని ఉషారాణి తెలిపారు. కుటుంబ పరిస్థితులు, సరైన ఉపాధి లేకపోవడం వల్ల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాప తల్లి మంత్రి కార్యాలయ అధికారులకు తెలిపారు. భర్త వదిలేసి వెళ్లిపోయాడని, అద్దె ఇంట్లో ఉంటూ, దొరికిన పని చేసుకుంటూ తానే ఇద్దరు ఆడపిల్లలను పోషించుకుంటున్నానని రుక్సానా తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ఉపాధి కల్పించాలని ఆమె కోరగా, ఈ విషయాన్ని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి సానుకూలంగా స్పందించారు. చిన్నారి తల్లికి గాంధీ హాస్పిటల్‌లోనే, ఆమె అర్హతకు తగిన ఉద్యోగం కల్పించాలని సూపరింటెండెంట్ ఉషారాణికి సూచించారు. పాపకు గాంధీలోనే పూర్తిస్థాయిలో మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. రుక్సానా తల్లికి వారం రోజుల్లో ఉద్యోగం కల్పిస్తామని ఉషారాణి భరోసా ఇచ్చారు.

కాక్రోచ్ పార్టీ నిరసనల బాధ్యతలు అజింక్య షిండే చేతికి..

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేతో పాటు పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఉద్యమ బాధ్యతలు అజింక్య షిండే చేతికి వచ్చాయి. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ చేపట్టిన నిరసనలను ఇకపై ఆయనే నడిపించనున్నారు. మహారాష్ట్రకు చెందిన షిండే.. దీప్కేకు అత్యంత సన్నిహితుడు. తనను, సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను పోలీసులు అరెస్టు చేస్తే ఉద్యమాన్ని షిండే ముందుకు తీసుకెళ్తారని దీప్కే ఓ వీడియోలో ప్రకటించారు. ఆయన సూచనల మేరకు షిండే నిరసనకారులకు పిలుపునిచ్చారు. జంతర్‌మంతర్ చేరుకోవాలని, పోలీసులు ఎక్కడ అడ్డుకున్నా అక్కడే నిరసన కొనసాగించాలని కోరారు. తమ ఐక్యతను చూసి ప్రభుత్వం భయపడుతోందని వ్యాఖ్యానించారు.

ఎవరీ అజింక్య షిండే?

మహారాష్ట్రకు చెందిన అజింక్య షిండే వయసు 35 ఏళ్లు. కంప్యూటర్ సైన్స్‌లో పట్టా పొందిన ఆయన.. పుణెలోని ఓ అంతర్జాతీయ ఐటీ సంస్థలో పనిచేశారు. ఆ తర్వాత ఉద్యోగాన్ని వదిలి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో పూర్తిస్థాయి కార్యకర్తగా చేరారు. ఆయన తల్లిదండ్రులు తొలుత అలీబాగ్‌లో వ్యవసాయం చేసేవారని, తర్వాత లాతూర్‌కు వెళ్లి స్థిరపడ్డారని కథనాల ద్వారా తెలుస్తోంది. 2016లో గోవాలో దీప్కేతో షిండేకు పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఇద్దరూ కలిసి పనిచేస్తున్నారు. ఆప్‌లో పింప్రి-చించ్‌వాడ్ కన్వీనర్‌గా పనిచేసిన షిండే.. ఉద్యోగానికి రాజీనామా చేసిన తర్వాత గోవా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తరఫున పనిచేశారు. అనంతరం ఆప్ మహారాష్ట్ర విభాగంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా, యువజన విభాగం కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ ఏడాది ఆగస్టులో షిండేను దీప్కే సీజేపీ జాతీయ బృందంలోకి తీసుకున్నారు. జాతీయ సంస్థాగత వ్యవహారాల బాధ్యతలు అప్పగించారు. అయితే, ఆయనకు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడంపై అప్పట్లో వివాదం చెలరేగింది. సన్నిహితులకు దీప్కే పెద్దపీట వేస్తున్నారని గుజరాత్‌కు చెందిన ఇద్దరు కార్యకర్తలు ఆరోపించారు. ప్రస్తుతం పార్టీ అగ్రనేతలైన దీప్కే, రంకా, దాస్ తర్వాతి స్థానంలో షిండే ఉన్నారు. జులైలో పేపర్ లీక్ నిరసనల్లో ఈ ముగ్గురు కీలకంగా వ్యవహరించారు. ఇప్పుడు వారంతా పోలీసుల అదుపులో ఉండటంతో ఉద్యమాన్ని ముందుకు నడిపించే బాధ్యత షిండేపై పడింది.

సంపాదకీయం

డిఎస్‌సిలో అక్రమాలంటూ వ్యవస్థలపై దాడి



రాజకీయ స్వప్రయోజనాల కోసం డిఎస్‌సిలో అక్రమాల పేరిట గౌరవనీయ వృత్తిలో వున్న ఉపాధ్యాయులపైనా, విద్య, శాప్, పోలీసు వంటి వ్యవస్థలపైనా కూడా దాడి చేస్తున్నారు. స్వార్థ రాజకీయాలకు వ్యవస్థలను బలిచేయడం సమాజానికి మంచిది కాదు. ఎంతో కష్టపడి డిఎస్‌సి పరీక్ష ద్వారా ఉత్తీర్ణులై తాము ఉద్యోగం సంపాదిస్తే, ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగం సంపాదించినట్టు ఆరోపణలు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు ప్రదర్శనగా ఇటీవల విజయ వాడ శాప్ కార్యాలయానికి వస్తుండగా, వారిపై రౌడీమూకలు కోడిగుడ్లు, కర్రలతో దాడి చేసి, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించాయి. ఒకవేళ అక్రమాలు జరిగినా ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలే కానీ, వ్యక్తులపై దాడి చేయకూడదు. న్యూఢిల్లీలో జరిగిన జెన్‌జీ ఉద్యమంలో కూడా నిజమైన విద్యార్థులపై కేసులు నమోదు చేయకుండా విద్యార్థుల ముసుగులో వున్న రౌడీలపై కేసులు కొనసాగించాలన్న సుప్రీంకోర్టు తీర్పును అనుసరించాలి. ఈ నేపథ్యంలో డిఎస్‌సిలో అక్రమాలు జరిగాయంటూ చట్టవ్యతిరేకంగా వ్యవహరించే వారిపై కేసులు నమోదు చేయడం సమంజసమే. అసలు డిఎస్‌సితో సంబంధం లేని కొంతమంది నాయకులు అక్రమాలు జరిగాయంటూ హైకోర్టుకు వెళ్లగా, మీకేమి సంబంధం అంటూ న్యాయమూర్తులు ప్రశ్నించడంతో పాటు, నష్టపోయినవారు మాత్రమే ఆధారాలతో కోర్టుకు రావాలని పేర్కొన్నారు. అయితే అక్రమాలు జరిగాయంటూ ఆరోపించే నాయకులే కాదు.. డిఎస్‌సి పరీక్షలకు హాజరైన ఏ అభ్యర్థీ కోర్టుకు వెళ్లలేదు. కేవలం జిల్లా స్థాయిలో జరిగిన నియామకాలకు సంబంధించి దేశంలోనే అత్యున్నతమైన దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని కోరడాన్ని బట్టి, డిఎస్‌సిని అడ్డుపెట్టుకొని రాజకీయ లబ్ధి పొందాలనే ఎత్తుగడ మాత్రమే కనిపిస్తోంది. తొలుత మొత్తంగా డిఎస్‌సి నిర్వహణలో అక్రమాలు జరిగాయని ఆరోపించిన నేతలు, అధికారులు ఆధారాలతో సహా వివరణ ఇచ్చేసరికి, తాజాగా స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయంటూ గందరగోళం సృష్టిస్తున్నారు.డిఎస్‌సి నిర్వహణలో అన్యాయం జరిగిందని నోటి మాటగా చెప్పేవారు ఎందుకు ఆధారాలతో కేసులు దాఖలు చేయడం లేదు? ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందారని ఆరోపణలకు గురైన ప్రతి ఉపాధ్యాయుడు తమ వద్ద ఉన్నవి నిజమైన సర్టిఫికెట్లు అంటూ వాటిని ప్రదర్శిస్తున్నారు. ఉదాహరణకి విశాఖ పట్నానికి చెందిన యోగేశ్వరరావు అనే అభ్యర్థి అతని సోదరితో పాటుగా ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందారని, కనీసం టెట్ కూడా పాస్ కాలేదని వైసీపీ నేత జగన్మోహనరెడ్డి విలేకరుల సమావేశంలో ప్రస్తావిం చారు. దాంతో ఆ అన్నాచెల్లెళ్లు తమ సర్టిఫికెట్లు నకిలీవి కావని, రుజువు చేయడానికి ఎక్కడికైనా వస్తామని బహిరంగంగా ప్రకటించారు. డిఎస్‌సిలో అక్రమాలు అంటూ నోటికి వచ్చిన ఆరోపణలు చేయడమే కాకుండా బ్రిడ్జి ఆట (వీరి దృష్టిలో పల్లెల్లో చెట్ల కింద కూర్చొని ఆడే పేకాట) ఆడినవారికి కూడా ఉద్యోగాలు ఇచ్చారంటూ ఒక ప్రబుద్ధుడు వ్యాఖ్యానించారు. బ్రిడ్జి ఆట కింద ఉద్యోగం పొందడం నిజమైతే రుజువు చేయాలి కదా? డిఎస్‌సి ఫలితాలను, ఏ కేటగిరీలో ఎవరు ఉద్యోగాలు పొందారు, వారికి వచ్చిన మార్కుల వివరాలను నెట్‌లో అందుబాటులో ఉంచారు. ఇదే సమయంలో డిఎస్‌సి నిర్వహణపై అసెంబ్లీలో చర్చించడానికి రావాల్సిందిగా సంబంధిత మంత్రి నారా లోకేష్ బహిరంగంగా ప్రకటించారు. నిజంగా డిఎస్‌సిలో అక్రమాలు జరిగివుంటే ఆ అన్నాచెల్లెళ్ల సర్టిఫికెట్లు నకిలీవని రుజువు చేస్తే చాలు.. అధికార పార్టీ పరువు పోతుంది. కానీ జగన్మోహన్‌రెడ్డి ఆ ప్రయత్నం చేయకుండా కేవలం సోషల్ మీడియాలో గందరగోళం సృష్టించడం ద్వారా ప్రభుత్వ వ్యవస్థలను అవహేళన చేస్తున్నారు. వైసీపీ తరపున 11 మంది శాసనసభ్యులు విజయం సాధించినప్పటికీ ఏ ఒక్కరూ చట్టసభకు హాజరుకాకుండా ఆయా నియోజకవర్గాల ప్రజలను, సభను అగౌరపరుస్తున్నారు. డిఎస్‌సి వ్యవహారంలో చట్టసభనే గౌరవించనివారు చట్టబద్ధంగా వ్యవహరిస్తారని, ప్రభుత్వ వ్యవస్థలను గౌరవిస్తారని భావించడం అత్యాశ అవుతుందేమో!

రైతులకు కరెంటు ఇవ్వరు నీళ్లు ఇవ్వరా

-మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్.

-కెసిఆర్ రైతును రాజును చేస్తే, రేవంత్ ప్రభుత్వం రైతులను అరగోస పెడుతున్నారు.

ఎలిగేడు, అక్టోబర్10, (తెహెల్కా న్యూస్):-

బిఆర్ఎస్ పార్టీ రైతును రాజును చేస్తే, కాంగ్రెస్ పార్టీ రైతులను అరగోసపెట్టుకుంటూ బిచ్చగాళ్లను చేస్తుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎలిగేడు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ స్థానిక నాయకులతో కలిసి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపెల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్, పెద్దపెల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ దాసరి మమతా రెడ్డి, స్థానిక మాజీ ఎంపీపీ ప్రవంతి మోహన్ రావు, మండల అధ్యక్షుడు బైరెడ్డి రామిరెడ్డి నాయకులతో కలిసి సబ్‌స్టేషన్ ముట్టడించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ మన బిఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాల కాలంలో రెప్పపాటు సమయంలో కూడా కరెంటు కోతలు లేకుండా ఉండేది అని 24 గంటల నాణ్యమైన కరెంటును రైతులకు అందించిన ఘనత కెసిఆర్ గుర్తు చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రైతులను



అరగోసపెట్టుకుంటూ కరెంటు ఉత్పత్తిని పెంచకుండా పొలాలకు సరిపోయే విద్యుత్ అందించకుండా విద్యుత్ కోతలు పెట్టడం, ఎస్సారెస్పీ కాలువల ద్వారా ఇప్పటివరకు రైతులకు చుక్క నీరు కూడా అందిం చలేదని ఒక వైపేమో రైతుల పొలాలు ఎండిపో తున్నాయి, మరోవైపు కాంగ్రెస్ మంత్రుల, ఎమ్మెల్యేలు ఎలాంటి కరెంటు కోతలు విధించడం లేదని డబ్బా మాటలు చెప్పుకుంటున్నారు. ఇకనైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు నాణ్యమైన కరెంటును అలాగే పొలాలకు అవసరమైన యూరియా ఎరువులను నీరును ఎస్సారెస్పీ కాలువల ద్వారా అందించాలని



డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, పెద్దపెల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ దాసరి మమతారెడ్డి, మాజీ గ్రంథా లయ చైర్మన్ రఘువీర్ సింగ్, మాజీ ఎంపీపీ తానిపర్తి ప్రవంతి మోహన్ రావు, మండల అధ్యక్షుడు బైరెడ్డి రామిరెడ్డి, సుల్తాన్పూర్ సర్పంచ్ బాబయ్య, ఉప సర్పంచ్ రమేష్ రావు, నాయకులు బద్దం తిరుఎ తిరెడ్డి, పోషాలు, రాజేశం, వినోద్, సంపత్, నారా యణ, సాయినాథ్, సది, కార్తీక్, టీత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గొర్ల ఇంద్రారెడ్డి ఆశయ స్ఫూర్తితో, పేద ప్రజల హక్కుల కొరకు కృషి చేయలి

– జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ ప్రతినిధి//అక్టోబర్ 10:(తెహెల్కా న్యూస్):-

సిపిఎం సీనియర్ నాయకులు, తెలంగాణ రైతు సంఘం నాయకులు, నల్లగొండ జిల్లా రైతాంగ పోరాటాల వారసత్వం తో ఈ ప్రాంతం లో సిపిఎం నిర్మాణం కోసం చివరి వరకు కృషి చేసిన కామ్రేడ్ గొర్ల ఇంద్రారెడ్డి 5వ వర్ధంతి సభ మిర్యాలగూడ మండలం తడకమళ్ళ గ్రామం లో వారి స్థూపం వద్ద వారికీ నివాళులు అర్పించి వర్ధంతి సభ నిర్వహించడం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ శాసనసభ్యులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ గొర్ల ఇంద్రారెడ్డి తన జీవితాంతం పేద ప్రజల, రైతాంగ, వ్యవసాయ



కార్మికుల కోసం, భూమి కోసం, రైతు హక్కులు రక్షించబడాలంటే ఎర్రజెండా ఒక్కటే మార్గమని నమ్మి ఆ జెండా నీడ కింద పోరాడాడని కొనియాడారు. రైతు సంఘం నిర్మాణంలో, పార్టీ నిర్మాణంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని, ఆయన నిబద్ధత, నిరాడంబరత, క్రమశిక్షణ నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, ఈ నేపథ్యంలో గొర్ల ఇంద్రారెడ్డి చూపిన పోరాట స్ఫూర్తితో రైతు సంఘాన్ని, సిపిఎం పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బీకార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్ జిల్లా కమిటీ సభ్యులు సీతారాములు, మాజీ సర్పంచ్ సైదమ్మ, వెంకటయ్య, మండల కమిటీ సభ్యులు జిల్లా నగేష్, శాఖ కార్యదర్శిలు పంగా అశోక్, పుల్లయ్య, సోమయ్య, కుమ్మరి సైదులు, జానమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష

-ఒకరికి రూ. 1,000 జరిమానా.. మరో ఆరుగురికి రూ.4,000 జరిమానా

-ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు తనిఖీలు

సూర్యాపేట జిల్లా కేంద్రం, అక్టోబర్ 10 (తెహెల్కా న్యూస్)

-- జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్:

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ బి. యాదవేంద్ర రెడ్డి హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిపై కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు. సూర్యాపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని అక్టోబర్ 9, 2026న కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ వెల్లడించారు. ఈ కేసుల్లో ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీమతి



గోపు రజిత తీర్పు వెల్లడిస్తూ, ఒకరికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా, మరో ఆరుగురికి కలిపి రూ.4,000 జరిమానా విధించినట్లు తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు పట్టణంలో నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్ర మాదం ఉందన్నారు. పోలీసులు నిర్వహించే వాహన తనిఖీలు ప్రజల ప్రాణాలను రక్షించేందుకేనని పేర్కొ న్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిం చాలని, మద్యం సేవించి వాహనాలు నడప కుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచిం చారు. రోడ్డు భద్రత కోసం పోలీసులకు ప్రజలు సహక రించాలని కోరారు.

కోదాడ ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో ఈయూ--టీఎంయూ--ఎన్ఎంయూ కూటమి ఘన విజయం!

-క్లాస్--3లో బస్సు గుర్తుకు 165 ఓట్లు.. 71 ఓట్ల మెజార్టీ

-క్లాస్--6లో నిచ్చెన గుర్తుకు 159 ఓట్లు.. 62 ఓట్ల ఆధిక్యం

-261 ఓట్లకు 259 ఓట్లు పోలింగ్.. ఉత్సాహంగా పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

సూర్యాపేట, అక్టోబర్ 10 (తెహెల్కా న్యూస్) -- జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్:

కోదాడ ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ఉద్యోగుల యూనియన్ ఎన్నికల్లో ఈయూ (ఎంప్లాయీస్ యూని యన్), టీఎంయూ, ఎన్ఎంయూ కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. క్లాస్--3, క్లాస్--6 విభాగాల్లో ప్రత్యర్థులపై స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించి ఉద్యోగుల మద్దతును చూర గొన్నారు. ఎన్నికల్లో ఆర్టీసీ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగి ంచుకున్నారు.

-క్లాస్--3లో బస్సు గుర్తుకు భారీ మెజార్టీ

క్లాస్--3 విభాగంలో బస్సు గుర్తుపై పోటీ చేసిన అభ్యర్థులకు 165 ఓట్లు లభించాయి. ప్రత్యర్థి టిడ బ్ల్యూ యూనియన్‌కు చెందిన బాణం గుర్తు అభ్య ర్థులకు 94 ఓట్లు పోలయ్యాయి. దీంతో బస్సు గుర్తు అభ్యర్థులు 71 ఓట్ల మెజార్టీతో ఘన విజ యం సాధించారు.

-క్లాస్--6లో నిచ్చెన గుర్తు అభ్యర్థుల విజయం

క్లాస్--6 విభాగంలో నిచ్చెన గుర్తుపై పోటీ చేసిన అభ్యర్థులకు 159 ఓట్లు వచ్చాయి. ఎస్‌డబ్ల్యూఎఫ్

యూనియన్‌కు చెందిన ధర్మచక్రం గుర్తు అభ్యర్థులకు 97 ఓట్లు లభించాయి. దీంతో నిచ్చెన గుర్తు అభ్య ర్థులు 62 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. రెండు విభాగాల్లోనూ కూటమి అభ్య ర్థులు గెలుపొం దడంతో యూనియన్ ప్రతిని ధులు, మద్దతుదారులు హర్షం వ్యక్తం చేశారు.

-261 ఓట్లకు 259 ఓట్లు పోలింగ్

కోదాడ ఆర్టీసీ డిపోలో మొత్తం 261 ఓట్లకు గాను 259 ఓట్లు పోలయ్యాయి. దాదాపు 99.2 శాతం పోలింగ్ నమోదైంది. అధిక సంఖ్యలో ఉద్యోగులు ఓటింగ్‌లో పాల్గొనడం ఎన్నికలపై వారి కున్న ఆసక్తిని, యూనియన్ ప్రతినిధుల ఎంపికలో వారి చొరవను తెలియజేసింది. ఎన్నికల్లో విజయం సాధించిన ఈయూ, టీఎంయూ, ఎన్ఎంయూ కూటమి ప్రతినిధులు ఉద్యోగుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ ఎన్నికల సందర్భంగా గురు లక్ష్మి, తోళ్ల భవాని, చుక్కమ్మ, రాణి, రేవతి, రేణుక, వాణి, రాజ్యలక్ష్మి, ఎం. రేణుక, విజయలక్ష్మి, ఝాన్సీ, ఎస్.కె. అబ్దుల్లా, ఎస్. జానయ్య, ఎస్.ఎస్. గౌడ్, ఎస్. వెంకన్న, జమా ల్ గౌడ్, ఆయు, ఏ. శ్రీను, కే. ఉప్పలయ్య, బి. పాండు, ఎస్.ఎస్. రావు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య గొంతుకపై ఉక్కుపాదం -- ఇది పాలనా? లేక అప్రకటిత ఎమర్జెన్సీనా?!

-ఆనాడు కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీ.. నేడు బీజేపీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు!
-ఓటు హక్కు మన హక్కు -- ప్రజాస్వామ్య పరిరక్షణ మన బాధ్యత!



ఎల్.బీ.నగర్,అక్టోబర్10,తెహెల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.

ఆనాడు కాంగ్రెస్ పార్టీ దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తే, నేడు బీజేపీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను సృష్టిస్తూ, ప్రతిపక్షాల గొంతును నొక్కుతూ, ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఓటర్ల పేర్లను అనైతికంగా తొలగిస్తోందనే ఆరోపణలు ప్రజాస్వామ్యంపై ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణ లక్ష్యంగా దేశవ్యాప్తంగా ఓటు చోరీ, ఓటర్ల జాబితాలో అక్రమాలపై వ్యక్తమవుతున్న ఆందోళనలకు మద్దతుగా ఎల్.బీ.నగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

-ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల తొలగింపుపై నిరసన.

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పేరుతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అర్హులైన ఓటర్ల పేర్లు పెద్దఎత్తున తొలగిస్తున్నారనే ఆరోపణలపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి, జవాబుదారీతనం పాటించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యానికి గుండెకాయ లాంటి భావవ్యక్తీకరణ స్వేచ్ఛను అణచివేస్తూ, ప్రశ్నించే గొంతులకు సంకెళ్లు వేస్తూ, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను నిర్బంధిస్తున్న చర్యలను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్రంగా ఖండిస్తోంది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఓటింగ్ ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఏఐ సాంకేతికతను ఉపయోగించి ప్రతిపక్షాల ఓట్లను లక్ష్యంగా చేసుకుని,ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా మోదీ ప్రభుత్వం అక్రమంగా ఓటర్ల పేర్లను తొలగిస్తోందనే ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

-నిరసన హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం.

దేశ రాజధానిలో నిర్బంధ వాతావరణం నెలకొన్న ట్లుగా సాగుతున్న చర్యలు ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. 57 మెట్రో స్టేషన్లను మూసివేయడం, సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకున్న తర్వాత కూడా 40 స్టేషన్లలో రాకపోకలకు అంతరాయం కలగడం, నార్తర్న్ రైల్వే పరిధిలో 38 రైళ్లను రద్దు చేయడం వంటి పరిణామాలతో సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారనే అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి.దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులను, ప్రయాణికులను ఇటార్సీ--భోపాల్ స్టేషన్ల వద్ద అడ్డుకోవడం, తెలంగాణ నుంచి తమ హక్కుల కోసం తరలివెళ్లిన విద్యార్థులను భోపాల్లో నిర్బంధించడం వంటి చర్యలు శాంతి యుత నిరసన తెలిపే హక్కుపై ప్రశ్నలు లేవనెత్తు తున్నాయి.ఈ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని అన్నారు.అరెస్టు చేసిన విద్యార్థులను వారి వారి రాష్ట్రాలకు క్షేమంగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.బిజెపి ఫేక్ మీడియా ద్వారా దేశద్రోహులని,పాకిస్తాన్ గూడచారులని,చైనా గూడచారులని,జార్జ్ సోరస్ మనిషి అనే ముద్రలు వేసే ప్రయత్నం మీ ఫేక్ మీడియా ద్వారా చేయకండి.మీరు గత 12 సంవత్సరాలుగా చేస్తున్న ప్రయత్నాలు ఇవన్నీ.ఒక శాంతియుత ప్రజాస్వామ్య నిరసనను అడ్డుకోవడానికి వేలాది మంది పోలీసులను మోహరించాల్సిన అవసరం ఏమిటి? ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పాలకులు, ప్రజల గొంతులను అణచివేయడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారు? ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కును గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై లేదా?

-ఎమర్జెన్సీ చరిత్రను గుర్తుచేస్తున్న ప్రస్తుత పరిణామాలు.

1975లో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ దేశ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచిపోయింది. నేడు ప్రజల హక్కులను అడ్డుకునే చర్యలు కొనసాగితే, అవి మరోసారి అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులను తలపిస్తాయి. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే నిరంకుశ పోకడలనైనా బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుంది.

-ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలి.

ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇవ్వాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఈ ధర్నా ద్వారా బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

-పాలకులు గుర్తుంచుకోవాలి.

నిర్బంధాలతో ప్రజాగ్రహాన్ని ఆపలేరు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, శాంతియుత నిరసన, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదులు. ప్రజల హక్కులను కాపాడటం, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం కోసం బీఆర్ఎస్ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుంది. ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొని ఓటు హక్కు పరిరక్షణకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

ఆర్టీసీలో ఏఐటీయూసీ విజయం ఎర్రజెండాపై కార్మికుల విశ్వాసా నికి నిదర్శనం

-ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్.



తెహెల్కా న్యూస్ భువనగిరి10-10-2026

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నిక ల్లో ఏఐటీయూసీ అనుబంధ ఎం ప్లాయిస్ యూనియన్ రాష్ట్రస్థా యి గుర్తింపు సంఘంగావిజయం సాధించడం ఆర్టీసీ కార్మికుల విజ యమని,ఎర్రజెండాపై వారికిఉన్న విశ్వాసానికి ఇది నిదర్శనమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అన్నారు.ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లా యిస్ యూనియన్ఏఐటీయూసీ అనుబంధం విజయం సాధించిన సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని వినాయక చౌర స్తా వద్ద ఏఐటీయూసీ నాయకు లు,కార్యకర్తలు బాణాసంచా కా ల్చి మిఠాయిలు పంచి విజయో త్సవసంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లా డుతూ... రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టా త్మకంగా జరిగిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ కార్మికులు ఎంప్లాయిస్ యూని యన్పై విశ్వాసం ఉంచి విజయా న్ని అందించారని తెలిపారు. ఈ విజయం కోసం కృషి చేసిన ఎం ప్లాయిస్ యూనియన్ నాయకు లు, కార్యకర్తలతో పాటు కూటమి లో భాగస్వాములుగా ఉన్న టీ ఎంయూ,ఎన్ఎంయూ నాయకు లకు అభినందనలు తెలిపారు. సింగరేణి,ఆర్టీసీ వంటి కీలకప్రభుత్వ రంగ సంస్థల్లో ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాలు సా ధించిన విజయాలు కార్మిక ఉద్య మాల పట్ల కార్మికులకు ఉన్న న మ్మకాన్ని తెలియజేస్తున్నాయని అన్నారు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడం,పెం డింగ్లో ఉన్న పీఆర్సీ బకాయి లు వంటి న్యాయబద్ధమైన డి మాండ్ల సాధన కోసం ఎంప్లాయి స్ యూనియన్ నిరంతరం పోరా డుతుందని,ఆర్టీసీని ప్రభుత్వం లో విలీనం చేసే వరకు కార్మికుల కు అండగా ఉంటూ, వారి హక్కు ల సాధన కోసం ఏఐటీయూసీ పోరాటాన్ని కొనసాగిస్తుందని ఇమ్రాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, నాయకులు రెహమాన్,పేర బోయిన మహేందర్, సామల శోభన్ బాబు,ఉప్పల శాంతి కుమార్, కందుల మధు,ఎండి నయీమ్,మారుపాక వెంకటేష్, చింటూ, జాను, రమేష్, సాయి, శ్రీకాంత్, గౌతమ్, ఆకాష్ తదితరు లు పాల్గొన్నారు.

శ్రీ సీతారామాంజనేయ స్వామి సహిత సంతోషి మాత దేవాలయంలో అన్నప్రసాదం







తెహెల్కా న్యూస్ భువనగిరి10-10-2026.

శ్రీ సీతారామాంజనేయ స్వామి సహిత సంతోష మాత దేవాల యంలో అన్నప్రసాద మునకు సహకరించిన దాతలు దాసోజు చిన్న నరసింహచారి అనసూయ జ్ఞాపకార్థం వారి కు మారుడు విశ్వరూప గురుస్వామి 10000,గ్యాస్ దాత సాదు ఉపేం దర్ గురు స్వామి, పోతంశెట్టి వినోద్ జ్ఞాపకార్థం వారితల్లిదండ్రులు పోతంశెట్టి దశరథ కాంతమ్మ 3016 ఇవ్వడం జరిగింది. డోప్ప హరికృష్ణ కూరగాయల దాత, ఇట్టబోయిన రాజు మంచినీళ్లు పొయ్యడం జరిగింది. పైన సహకరించిన దాతలకు ఆ భక్తాంజనేయస్వామి కృపా కటాక్షాలు ఆయురారోగ్యం ఐశ్వర్యం కలగాని కోరుకుంటూ. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎం.డి. నయీమ్‌కు అభినందనలు తెలిపిన తెలంగాణ ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్ కుమార్

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ అక్టోబర్ 10



కూకట్‌పల్లి నియోజకవర్గం మైనారిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన ఎం.డి. నయీమ్ తెలంగాణ ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్ కుమార్ నీ మూసాపేట్ లోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు, ఈ సందర్భంగా వారు నయీమ్‌నీ సాల్వతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేస్తూ వారు మాట్లాడుతూ ఎం.డి. నయీమ్ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మైనారిటీల సంక్షేమం కోసం కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. మైనారిటీల అభ్యున్నతికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, కాంగ్రెస్ పార్టీకి మరింత బలాన్ని చేకూర్చేలా ముందుకు సాగాలని తెలియజేశారు.

కూకట్పల్లి వివేకానంద కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో 36వ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ అక్టోబర్ 10



కూకట్పల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 11వ తేదీ నుండి 20వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ అర్చకులు రాఘవచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ దేవి శరన్నవ రాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు అలాగే ప్రత్యేక అలంకరణ ఉంటుందని అన్నారు. ప్రతిరోజు మహిళలచే లలితా సహస్రనామాలు అలాగే కుంకుమార్చనలు, వివిధ రకాల పూజలు ఉంటాయని అర్చకులు తెలిపారు. ఈ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కనుల విందుగా సేవించి, స్వామివారి కృపకు పాత్రులు కాగలరని అన్నారు.

బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జనగాం కవిత కు సన్మానం



తెహెల్కా న్యూస్ భువనగిరి10-10-2026

బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా నియమి తులైన భువనగిరి పట్టణానికి చెం దిన మాజీ కౌన్సిలర్ జనగాం కవి త నరసింహచారిని రాఘవేంద్ర పరపత్ సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. చైర్మన్ మంచాల వెంకటేశం మా ట్లాడుతూ...కవిత భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధి రోహించాలని కోరారు.ఈ కార్యక్రమంలోపరపతి సం ఘంసభ్యులు పగిడిమర్రి వీరేశం ఎలుగల రాజయ్య,బబ్బూర్ రవీంద్రనాథ్ గౌడ్, బండారు బాలరాజు, అనీఫ్, నువ్వుల సుధాకర్ సోమరాజు రెడ్డి. పరపతి సంఘం సభ్యులు తదితరులు పాల్గొ న్నారు.

స్టడీ కనెక్ట్ స్టడీ అబ్రాడ్ కార్నివాల్--2026 ప్రారంభం

హైదరాబాద్, అక్టోబర్ 10తెహెల్కా న్యూస్:

కూకట్‌పల్లి ఎన్ఎస్ఎల్ సెంట్రమ్ మాల్‌లో స్టడీ కనెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్టడీ అబ్రాడ్ కార్నివాల్-2026'ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ప్రారంభించారు. విదేశీ విద్యపై అవగాహన కల్పించేందుకు 15 అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు. యూకే, అమెరికా, యూరప్, డెన్మార్క్, స్పెయిన్‌లకు చెందిన బీపీపీ యూనివర్సిటీ, రోహంప్టన్, ఎడిన్‌బర్గ్ నేపియర్, నర్రే, అరిజోనా తదితర యూనివర్సిటీలు పాల్గొన్నాయి. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి విదేశీ విద్య దోహదపడుతుందన్నారు. స్టడీ కనెక్ట్ ఎండీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ సరైన సమాచారం, ప్రవేశ ప్రక్రియపై అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. విద్యార్థులు ప్రతినిధులతో నేరుగా మాట్లాడి సందేహాలు నివృత్తి చేసుకున్నారు.

రైతులు స్తంభాలెక్కే దుస్థితి ఎందుకు? నాగుల సత్యనారాయణ

-విద్యుత్ సమస్యలతో రైతుల ప్రాణాలకు ముప్పు..

ఏఈ,డీఈలు స్పందించరా?

తెహెల్కా రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 10ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:

మహేశ్వరం:రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ, కోళ్లపడకల్ గ్రామంలో మాత్రం రైతులకు సక్రమంగా విద్యుత్ అందడం లేదని పీఏసీఎస్ డైరెక్టర్ నాగుల సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటల కరెంట్ ఇస్తున్నామని చెబుతున్నారు.. కానీ మా గ్రామంలో ఆ విద్యుత్ ఎక్కడ వస్తోంది? అని మహేశ్వరం విద్యుత్ శాఖ ఏఈ, డీఈ అధికారులను ప్రశ్నించారు.గ్రామంలో లో వోల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు సరిగా పనిచేయడం లేదని, ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడటంతో ఫ్యూజులు కాలిపోతున్నాయని తెలిపారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ కోసం రైతులు దరఖాస్తు చేసుకోవడంతో పాటు డీడీ కూడా చెల్లించినా, ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.24 గంటల విద్యుత్ సరఫరా కాగితాలకే పరిమితమా? క్షేత్రస్థాయిలో రైతులకు ఎదురవుతున్న సమస్యలు అధికారులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే,సమస్య పరిష్కారంలో ఎందుకు జాప్యం జరుగుతోందో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మహేశ్వరం విద్యుత్ శాఖ ఏఈ, డీఈ అధికారులు తక్షణమే కోళ్లపడకల్ గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించాలని, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు.ఫోన్ చేసినప్పుడు విద్యుత్ సిబ్బంది స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.విద్యుత్ సమస్యలతో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద స్వయంగా జంపర్లు వేయడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు.అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని నాగుల సత్యనారాయణ స్పష్టం చేశారు.

-రైతులకు 24 గంటల విద్యుత్?

రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని చెప్పడం కాదు.. క్షేత్రస్థాయిలో నిజంగా విద్యుత్ అందేలా చూడాలి. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించడం విద్యుత్ శాఖ అధికారుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.



తెలుగింటి ఆడపడుచుల ఆత్మ గౌరవం బతుకమ్మ

-రంగురంగుల పూలతో బతుకమ్మను తయారు చేస్తున్న మహిళలు

-మహిళా మండలి అధ్యక్షురాలు నూనె సులోచన

కోదాడ,అక్టోబర్ 10... తెహెల్కా న్యూస్

ఆడపడుచుల ఆత్మగౌరవం బతుకమ్మ అని , బతుకమ్మ అంటే "బతుకు అమ్మా!" అని. అమ్మవారిని ప్రకృతి స్వరూపిణిగా భావించి, వివిధ రకాల కాలానుగుణ పూలతో బతుకమ్మను పేర్చి, భక్తిశ్రద్ధలతో పూజిస్తారు అని మహిళా మండలి అధ్యక్షురాలు నూనెలోచిన అన్నారు శనివారం కోదాడలోని నరేంద్రుని నాగేశ్వరరావు నిర్మల నివాసంలో. మహిళలు, బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మను తయారు చేశారు. బతుకమ్మ పండుగ రోజు వారి విశిష్టత గురించి వివరించారు. బతుకమ్మ పండుగ విశిష్టత ప్రకృతి ఆరాధన తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి పూలతో ప్రకృతిని పూజించడం జరుగుతుందన్నారు. గౌరీదేవిని పూజిస్తూ మహిళల జీవన సౌభాగ్యం, కుటుంబ శ్రేయస్సును ఆకాంక్షించడం స్త్రీల గౌరవం అని అన్నారు. కులమత భేదాలు లేకుండా మహిళలంతా ఒకచోట చేరి పండుగ జరుపుకోవడం బతుకమ్మ ప్రత్యేకత అన్నారు. జానపద పాటలు, ఆటలు, సంప్రదాయ దుస్తులు, పూల అలంకరణలతో ప్రాంతీయ వారసత్వాన్ని కాపాడుకోవడం, స్థానికంగా లభించే పూలను ఉపయోగించడం ద్వారా ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేయడం, బతుకమ్మను సాధారణంగా ఆశ్వయుజ మాసంలో మహాలయ అమావాస్య నుంచి తొమ్మిది రోజులపాటు జరుపుకుంటారు. ప్రతి రోజుకు ఒక ప్రత్యేకమైన పేరు, నైవేద్యం, ఆచార ప్రాధాన్యం ఉంటాయి అన్నారు. ఈ కార్యక్రమంలో



జగిని విజయమ్మ బొడ్ల భాగ్యలక్ష్మి పాల్గొన్నారు

ACB వలలో మహబూబాబాద్ సివిల్ సప్లైస్ విభాగం జిల్లా మేనేజర్ (టెక్నికల్)

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్‌తెహెల్కా న్యూస్

మహబూబాబాద్ సివిల్ సప్లైస్ విభాగం జిల్లా మేనేజర్ (టెక్నికల్)పై అక్రమ ఆస్తుల కేసు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ACB), సివిల్ సప్లైస్ విభాగం జిల్లా మేనేజర్ (టెక్నికల్) శ్రీ వి. నరసింహారావుపై అక్రమ ఆస్తుల (DA) కేసును నమోదు చేసింది. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా మేనేజర్‌గా (RDC) పనిచేస్తున్న మరియు గతంలో ఖమ్మం కలెక్టరేట్‌లో పనిచేసిన ఈ అధికారి, తన సర్వీసు కాలంలో అవినీతి పద్ధతులు మరియు అక్రమ మార్గాల ద్వారా ఆస్తులను కూడబెట్టారని ఆరోపణలు ఉన్నాయి. 2016లో సవరించిన అవినీతి నిరోధక చట్టం–1988లోని సెక్షన్ 13(1)(ఎ) మరియు సెక్షన్ 13(2) ప్రకారం ఇది శిక్షార్హమైన నేరం కావడంతో, ఈ కేసును నమోదు చేయడానికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి. దీనికి సంబంధించి, సదరు అధికారి, వారి బంధువులు,సన్నిహితులకు చెందిన 7 ప్రదేశాలలో ప్రాథమిక సోదాలు నిర్వహించబడ్డాయి. ఈ సోదాల సమయంలో అనేక స్థిర మరియు చర ఆస్తులు గుర్తించబడ్డాయి. ఆస్తి వివరాల నివేదికలో పేర్కొన్న వివరాలు క్లుప్తంగా కింద ఇవ్వబడ్డాయి:

-A. స్థిర ఆస్తులు

1. ఖాళీ స్థలాలు: ఖమ్మం జిల్లాలోని బోలేపల్లి, రఘునాథపాలెం, వెలుగుమట్ల ప్రాంతాలలో మొత్తం 1,230.16 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన ఐదు ఖాళీ స్థలాలు సదరు అధికారి,వారి భార్య పేర్ల మీద ఉన్నాయి. వీటి మొత్తం డాక్యుమెంట్/రిజిస్ట్రేషన్ విలువ రూ. 30,72,000/– 2. వ్యవసాయ భూములు: సూర్యాపేట జిల్లా, మోతే మండలంలోని కమట చెరువు (సుమారు 1.00 ఎకరం), స్కంద (21.3 ఎకరాలు), నామవరం (331 ఎకరాలు) ప్రాంతాలలో ఉన్న వ్యవసాయ భూములు. ఇవి అనుమానిత అధికారి,అతని కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్నాయి. స్కంద భూమికి సంబంధించి నమోదిత పత్రం/రిజిస్ట్రేషన్ విలువ రూ. 76,00,000/– ,ఒప్పంద విలువ రూ. 6,54,75,000/–. నామవరం వద్ద ఉన్న రెండు భూమి భాగాలకు సంబంధించి, ఒక్కోదానికి పత్రం విలువ రూ. 19,25,000/– ,ఒప్పంద విలువ రూ. 1,92,50,000/–. 3. RCC భవనాలు/ఇళ్లు: ఖమ్మం, కవిరాజ్ నగర్‌లో G+2 ,G+4 RCC భవనాలు; అలాగే బరామల్‌గూడ, సాగర్ ఎన్‌క్లేవ్‌లో గ్రౌండ్, మొదటి, రెండవ అంతస్తులు కలిగిన ఇల్లు. ఇవి అనుమానిత అధికారి, అతని భార్య,మామ పేర్లపై ఉన్నాయి. వీటి మొత్తం పత్రం విలువ రూ. 1,58,00,000/–. చరాస్తులు వాహనాలు: హ్యుందాయ్ క్రెటా కారు (Reg. No. TS 04 EB 4975) – రూ. 18,49,759/–; TVS p పిటర్ (Reg. No. TS 04 ES 4772) – రూ. 1,05,000/– ; మరియు హోండా యాక్టివా 4G (Reg. No. TS 04 ES 2517) – రూ. 50,000/–. గృహోపకరణాలు: రూ. 33,48,400/–; బంగారం... అనుమానిత అధికారి నివాసం నుండి సుమారు 380.97 గ్రాముల బంగారం, 331.58 గ్రాముల వెండి ఆభరణాలు (వీటి మొత్తం విలువ రూ. 9,31,321), రూ. 15,600 నగదు స్వాధీనం చేసుకోబడ్డాయి. ఇప్పటి వరకు గుర్తించిన ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ. 9,41,06,975 (తొమ్మిది కోట్ల నలభై ఒక్క లక్షల ఆరు వేల తొమ్మిది వందల డెబ్భై ఐదు రూపాయలు). పైన పేర్కొన్న స్థిరాస్తుల మార్కెట్ విలువ, వాటి డాక్యుమెంట్/రిజిస్ట్రేషన్ విలువ కంటే చాలా ఎక్కువగా ఉంటుందని అంచనా. గుర్తించిన ఆస్తులకు సంబంధించిన యాజమాన్యం, వాటిని పొందిన విధానం, లావాదేవీల స్వభావం మరియు నిధుల మూలాలపై తదుపరి పరిశీలన, దర్యాప్తు జరుగుతోంది. బినామీ పేరుతో ఒక రైస్ మిల్లును కూడా కొనుగోలు చేసినట్లు అనుమానం ఉంది; కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా దాని యాజమాన్యం, పెట్టుబడి మూలాలను పరిశీలిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతోంది. చట్టపరమైన చర్యల కోసం ప్రజలు ఏసీబీ (ACB) టోల్–ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలని కోరడమైనది. సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.



ఉమ్మడి జిల్లా సీనియర్ ఖో ఖో జట్ల ఎంపికకు విశేష స్పందన

– హాజరైన 80 మంది క్రీడాకారులు.

తెహెల్కా న్యూస్ కరీంనగర్ అక్టోబర్ 10

జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి (పెద్దపల్లి జిల్లా మినహా) సీనియర్ ఖో ఖో జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రానికి సమీపంలోని లయోలా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం నిర్వహించిన ఈ పోటీలకు కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల లోని వివిధ ప్రాంతాల నుంచి 50 మంది పురుషులు, 30 మంది మహిళలు హాజరయ్యారు. ఈ పోటీలను జిల్లా కోకో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మాజీ సుధా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వై మహేందర్ రావులు క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కరీంనగర్ జిల్లా జట్లు ప్రతిభ చాటి విజేతలుగా



నిలవాలన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 29, 30 , 31 నవంబర్ 1వ తేదీలలో నల్గొండ జిల్లాలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్స్ ఖో ఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం మహిళలు, పురుషులకు వేరువేరుగా పోటీలను నిర్వహించి ప్రతి భ ఛాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఈ పోటీల నిర్వహణలో తెలంగాణ రాష్ట్ర ఖో ఖో



అసోసియేషన్ రెఫరీస్ బోర్డ్ కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాష్, జిల్లా ఖో ఖో సంఘ ఉపాధ్యక్షులు ఆర్ ఐ ఆఫ్ పోలీస్ కుమారస్వామి, డాక్టర్ ఏ రవీందర్, జిల్లా ఖో ఖో సంఘ సభ్యులు కట్ట సంతోష్, బి శేఖర్, ఫిజికల్ డైరెక్టర్లు రేణుక, రాజబాబు, రవి, సీనియర్ క్రీడాకారులు కరుణాకర్, రాము, తదితరులు పాల్గొన్నారు.



బంగారం ధరలు



manepally Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP
Google play App Store
GOLD & SILVER RATES

24 kt	₹	1,51,420	10gms
22 kt	₹	1,38,800	10gms
SILVER	₹	2,29,900	1kg

Contact: 6309 111299 | 99120 10888

'ఖాదీలో కదలండి - భారతదేశాన్ని ముందుకు నడిపించండి'



హైదరాబాద్, అక్టోబర్ 10తెహెల్కా న్యూస్:

'ఖాదీలో కదలండి – భారతదేశాన్ని ముందుకు నడిపించండి' నినాదంతో నిఫ్ట్ హైదరాబాద్ ఖాదీ 5k రన్‌ను శుక్రవారం విజయవంతంగా నిర్వహించింది. నాబార్డ్, మై భారత్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో 150 మంది విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.భారత స్వాతంత్ర్య ఉద్యమంతో ముడిపడిన ఖాదీని నేటి యువత జీవనశైలిలో భాగం చేయడమే లక్ష్యంగా ఈ రన్ నిర్వహించారు. ఖాదీ రన్నింగ్ వెస్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నిఫ్ట్ ప్రాంగణంలో ప్రారంభమైన కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ డా. మాలిని దివాకళ స్వాగత ప్రసంగం చేశారు. గేట్ నంబర్ 3 వద్ద జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ పృథ్వీరాజ్ మాల్, ఈవెంట్ కోఆర్డినేటర్ తాడేపల్లి శ్రీవాణి, నాబార్డ్ జీఎం రామలక్ష్మి పెనుగొండ పాల్గొన్నారు.

పట్టణంలో ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ పండుగ సంబరాలు



తెహెల్కా న్యూస్ భువనగిరి10-10-2026

పట్టణం కిల్ల నగర్ లోని శ్రీ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో ఎంగిలిపూల బతుకమ్మ పండగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు రంగురంగుల పూలతో బతుకమ్మలను చేర్చి గౌరమ్మను పూజిస్తూ ఎంతో సంబరంగా బతుకమ్మలు ఆడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వార్డు మహిళలు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

అల్కాపురి కాలనీలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు..పాల్గొన్న దేప సురేఖ భాస్కర్ రెడ్డి



తెహెల్కా రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 10ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:

మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ పరిధిలోని అల్కాపురి కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ, మహిళలందరికీ ఎంగిలిపూల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రకృతిని,పూలను పూజిస్తూ మహిళ లంతా ఐకమత్యంతో,ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను జరుపుకోవడం సంతోషకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో అల్కాపురి కాలనీ మహిళా మండలి సభ్యులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సిల్క్ నగర్‌లో నీటి సమస్యకు పరిష్కారం

-వృథాగా ఉన్న బోరుకు మోటారు బిగించి నీట
⁹ సౌకర్యం కల్పించాం
-ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్

తెహెల్కా న్యూస్ అక్టోబర్ 10 ఆలేరు:



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని ఏడవ వార్డు సిల్క్ నగర్‌లో నెలకొన్న నీటి సమస్య తీర్చమని మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ తెలిపారు. చాలా రోజులుగా నిరుపయోగంగా ఉన్న బోరుకు మోటారు బిగించి శనివారం స్థానిక ప్రజలకు నీటి సౌకర్యం కల్పించామని పేర్కొ న్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని, వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కా రానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.బోరుకు మోటారు బిగించి నీటి సమస్యను పరిష్కరించడంతో సంతోషం వ్యక్తం చేసిన సిల్క్ నగర్ వార్డు ప్రజలు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగోటి వెంకటేష్, బిరు వెంకటేష్, గొట్టిపాముల నర్సి ంలు, కృష్ణ, చిట్టి, మిల్ల కృష్ణ, భేదిచెందు, చింతకింది సిద్దులు, చింతకింది సత్యనారాయణ, చింతకింది బేతి ఆంజనేయులు, గారిపెళ్లి యాదగిరి, రంగ, యాదగిరి, చింతకింది గణేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల గడ్డపై ప్రగతి సంతకశీ

-దశాబ్దాల కల సాకారం అభివృద్ధి దిశగా అడుగులు
-విద్యా, వైద్య రంగాల్లో ముందడుగు..
-ఆధునికీకరణ బాటలో రైల్వే వ్యవస్థ
-ధాతల త్యాగాలకు నిలువెత్తు సాక్ష్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాల



తెహెల్కా న్యూస్ కామారెడ్డి, అక్టోబర్ 10,

ఒకప్పుడు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వందల కిలోమీటర్లు ప్రయాణిం చాల్సిన పరిస్థితి ఉన్నత వైద్యం కోసం హైదరాబాద్ బాట పట్టాల్సిన దుస్థితి ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారిన రోజులుఇవన్నీ ఒకప్పటి కామారెడ్డి ప్రాంత ప్రజల అనుభవాలు. దశాబ్దాల ప్రజా ఉద్యమాలు, ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష, స్థానిక ప్రజల పోరాటాల ఫలితంగా 2016 అక్టోబరు 11న కామారెడ్డి జిల్లా ఆవిర్భవించింది. నాటి నుంచి నేటి వరకు పరిపాలన, విద్య, వైద్యం, రవాణా రంగాల్లో అనేక మార్పులకు ఈ ప్రాంతం వేదికైంది. మరోవైపు పారిశ్రామికాభివృద్ధి, నిరుద్యోగ సమస్య పరిష్కారం, మెరుగైన పట్టణ మౌలిక వసతుల కల్పన వంటి అంశాలు ఇంకా కీలక సవాళ్లుగానే ఉన్నాయి. సాధించిన ప్రగతిని సమీక్షిం చుకుంటూ భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకోవాల్సిన తరుణమిది.

-నాలుగు దశాబ్దాల పోరాటంప్రజల చిరకాల స్వప్నశీ

కామారెడ్డి జిల్లా ఏర్పాటు వెనుక సుదీర్ఘ ప్రజా పోరాట చరిత్ర ఉంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో భాగంగా ఉన్న ఈ ప్రాంతంలోని జుక్కల్, మద్నూర్, బిచ్‌కుంద తదితర సరిహద్దు మండలాల ప్రజలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే సుదూర ప్రయాణాలు చేయాల్సి వచ్చేది. చిన్నపాటి పరిపాలనా అవసరాల కోసం కూడా సమయం, డబ్బు వెచ్చించాల్సిన పరిస్థితి ప్రజలకు భారంగా ఉండేది కామారెడ్డి నియోజకవర్గ శీ 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలు బరిలో నిలవగా బిజెపి అభ్యర్థిగా కాటేపల్లి వెంకటరమణారెడ్డి పోటీలో నిలిచారు. ఎవరు ఊహించని విధంగా ముఖ్యమంత్రిని కాబోయే ముఖ్య మంత్రిని ఓడించి రమణారెడ్డి విజయం పొందడంతో దేశం మొత్తం కామారెడ్డి వైపే చూసే విధంగా ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అభివృద్ధిలోనూ ముందుకు సాగుతోంది జిల్లాలో ఎల్లారెడ్డి నుండి మదన్మో హన్రావు కాంగ్రెస్ బాన్సువాడ నియోజకవర్గం లో పోచారం శ్రీనివాస్ రెడ్డి జుక్కల్ నియోజకవర్గం లో లక్ష్మీ కాంతారావు కాంగ్రెస్ పార్టీ లో కొనసాగుతున్నారు కాదా కామారెడ్డి బిజెపి కైవసం చేసు కుంది. జిల్లాలో కాంగ్రెస్ బిజెపి లుపోటీ పడుతున్నాయి. కాగా ప్రభుత్వ సలహా దారు షబ్బీర్ అలీ తనదైన స్టైల్ లో కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి నడుంబించారు అభివృద్ధికి నిధులను మంజూరు చేస్తూ ముందుకు సాగుతున్నారు.

కేసీఆర్ దూరదృష్టితోనే జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏర్పాటు జరిగింది

-మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకట రమణా రెడ్డి...

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి: (తెహెల్కా న్యూస్) అక్టోబర్ 10

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏర్పాటులో మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ దూరదృష్టి, ప్రత్యేక చొరవ ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకట రమణా రెడ్డి అన్నారు.జయశంకర్ భూపాల పల్లి జిల్లా గా ఏర్పడి పది సంవత్సరాలు కానున్న సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ, మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకట రమణా రెడ్డి గారి ఆధ్వర్యంలో మూడు రోజు ల పాటు నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగ ంగా నేడు భూపాలపల్లి హనుమాన్ టెంపుల్ నుండి మెడికల్ కాలేజీ మీదుగా సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకొని కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ బాపు కెసిఆర్ గారి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ క్రమంలో హనుమా న్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంత రం అంబేద్కర్ విగ్రహానికి, ప్రో. జయశంకర్ సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంద్ర మాట్లాడుతూ...

మారుమూల ప్రాంతంగా ఉన్న భూపాలపల్లిని జిల్లా కేంద్రంగా అభివృద్ధి చేసి, ప్రజలకు పరిపాలనను చేరువ చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటు అనేది అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయం కాదని, ఈ ప్రాంత అభివృద్ధిపై కేసీఆర్ ఎంతో ముందుచూపుతో ఆలోచించి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.ఉమ్మడి వరంగల్ జిల్లాను జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాలుగా విభజించాలనే ఆలోచన కేసీఆర్‌కు ముందుగానే ఉందని అప్పట్లో డెక్కన్ క్రానికల్‌లో పనిచేసిన సీనియర్ పాత్రికేయుడు కృష్ణారావు తనతో చెప్పినట్లు గుర్తుచేశారు. 2016 అక్టోబరు 11న కొత్త జిల్లాల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కేసీఆర్ బాటలు వేశారని అన్నారు. ప్రో.జయశంకర్ పేరు మీద జిల్లా ఏర్పాటు చేయడం తెలంగాణ సమాజానికి గర్వకార ణమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి సలహా లు, సూచనలు అందించిన ప్రొఫెసర్ జయశంకర్ పేరును జిల్లాకు పెట్టడం ద్వారా కేసీఆర్ ఆయనకు



సముచిత గౌరవం కల్పించారన్నారు. భూపాలపల్లి ప్రజలు కేసీఆర్‌ను ఎప్పటికీ మరచిపోరని,ఆయనను తమ గుండెల్లో నిలుపుకుంటారని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భూపాలపల్లిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వివరిం చారు. జిల్లా కలెక్టరేట్, పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయం, ఆసుపత్రి, వైద్య కళాశాల, సింగరేణి కార్మికుల కోసం వెయ్యి నూతన క్వార్టర్లు, పేదల కోసం రెండు పడక గదుల ఇళ్లు, డిగ్రీ కళాశాల వంటి నిర్మాణాలు ప్రణాళికాబద్ధంగా చేపట్టినట్లు తెలి పారు. జిల్లా కేంద్రంలో అవసరమైన ప్రభుత్వ కార్యా లయాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మెరు గైన పరిపాలనా సౌకర్యాలు కల్పించారని చెప్పారు. గతంలో కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులను కలవా లంటే వరంగల్ వెళ్లాల్సి వచ్చేదని, ఒక్కోసారి రెండు రోజుల సమయం పట్టేదని గుర్తుచేశారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోనే కలెక్టర్‌ను, ఇతర అధికారులను సులభంగా కలిసే అవకాశం ఏర్పడిందని తెలిపారు. తెలంగాణలో గతంలో పది జిల్లాలు ఉండగా, కేసీఆర్ ప్రభుత్వం వాటిని 33 జిల్లాలకు విస్తరించి పాలనను ప్రజలకు చేరువ చేసిందని పేర్కొన్నారు. మార్పు వస్తే ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు వస్తాయని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. పాలన కంటే రాజకీయ విమర్శలు, ఎదురుదాడులకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిందని, కమీషన్లకు ప్రాధాన్యం ఇచ్చే పాలన సాగుతోందని విమర్శించారు.గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో పోలిస్తే ప్రస్తుత పాలనలో ఆశించిన పురోగతి కనిపించడం లేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు,



మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీటి సరఫరా వంటి కార్యక్రమాలు తెలంగాణ అభివృద్ధిలో కీలకమని పేర్కొన్నారు. భూపాలపల్లి గ్రామపం చాయతీ స్థాయి నుంచి జిల్లా కేంద్రంగా ఎదగడానికి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలే పునాదిగా నిలిచాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని గంద్ర అన్నారు. మహాత్మా గాంధీ దేశానికి స్వాతంత్ర్యం సాధించడం లో కీలక పాత్ర పోషించినట్లుగానే, సమైక్య పాలన నుంచి తెలం గాణకు విముక్తి కల్పించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధిం చడంలో కేసీఆర్ ప్రధాన పాత్ర పోషించారని పేర్కొ న్నారు. అందుకే తెలంగాణ ప్రజలు ఆయనను తెలంగాణ బాపుగా భావిస్తున్నారని అన్నారు. విమర్శ లు చేయడం కంటే గత పదేళ్లలో జరిగిన అభివృద్ధిని పరిశీలించాలని ప్రతిపక్షాలకు సూచించారు. జిల్లా ఏర్పాటుకు పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రజలు గతాన్ని స్మరించుకోవాలని,అభివృద్ధి ప్రస్థానాన్ని గుర్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ప్రజలు,పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం:04:00 జూఎ కి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మహిళలతో బతుకమ్మ వేడుక లు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 12వ తేదీన జిల్లా కలెక్టరేట్‌లో అధికారులు, ప్రజలను కలుసుకునే కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. జిల్లా కోర్టులో న్యాయవాదులతోనూ సమావేశమై జిల్లా ఏర్పాటుతో వచ్చిన మార్పులు,అభివృద్ధి అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమానికి హాజరై న పార్టీ కుటుంబ సభ్యులు, మహిళలు,నాయకులు, కార్యకర్తలు,అభిమానులు, మీడియా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరికీ బతుక మ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

తన కోపమే తన శత్రువు అని ఎందుకు అంటారు?

-లెక్చరర్ ఉమాశేషారావు వైద్య

కామారెడ్డి ,అక్టోబర్ 10,(తెహెల్కా న్యూస్ జిల్లా ప్రతినిధి)

మీరు పిల్లలుమార్పు మీ దగ్గరే ప్రారంభం కావాలి ప్రయత్న పూర్వకంగా కొన్ని మంచి లక్ష ణాలు పసి వయసులోనే అల వాటు చేసుకోవాలి. దీనికి ఉప కరించేవి పెద్దలు, గురువులు చెప్పే మాటలు అలాంటిదే శత క నీతి కూడాఇప్పడు మనం తెలుసు కుంటున్న తన కోపమె తన శత్రువుసూక్తి సుమతీ శత కంలోనిదిమనకోపంఎక్కువగా మనల్నే నష్టపరు స్తుంది, మనం ప్రశాంతంగా ఉంటేమనం నేర్చు కునే విషయాలపట్ల మనకు ఏ కాగ్రతకుదు రుతుంది. ఎదుటివారు కష్టంలో ఉంటే ఆదుకునే మనస్తత్వాన్ని ఎంపొందించుకోవాలి. అంటూ మన సంతోష మే మనకు స్వర్గం, మన దుఃఖమే మనకు నరకం అంటారు బద్దెన పోతన ఓ మాటంటారు. వ్యాప్తిం బొందక వగవక ప్రాప్తంబగు లేశమైన బదివే లను చుందృప్తిం జెందని మనుజుడు సప్తద్వీపముల నయిన జక్కంబడునే అంటేలభించినది కొంచెం అయినా అదే పదివేలుగా భావించి తృప్తి పొందాలి. అలా తృప్తి పడనివారికి సప్తద్వీపాల సంపదలు వచ్చిపడినా కూడా తృప్తి తీరదు అంటారు.నన్ను ప్రేమగా చూసుకునే తల్లిదండ్రు లున్నారు, నాకు మంచి స్నేహి తులున్నారు. నేను మంచి పా ఠశాలలో చదువుతున్నా.నాకు మంచిగు రువులున్నారు..అలా మనకు ఉన్నవేవో వాటిలోని మంచిని తలుచుకుంటూ మన ప్రయత్నం, మన అభ్యాసంమటు కు నిజాయి తీగా చేయాలి. ఇది చేయకుండా అంటే ఉన్న వాటిలోని మంచిని చూడ కుం డా లేనివి ఏవో పనిగట్టుకుని ప్రతిక్షణం గుర్తు చేసుకుంటూ ఏడుస్తూ కూర్చుంటేఏమొస్తుం దిఉన్న పుణ్యకాలంగ డిచిపో తుంది. అలా నిత్యం దిగాలుగా ఉండి చేతిలో ఉన్న సమయా న్ని కూడా వృథా చేసు కునే వా డిని ఆ దేముడు కూడాకాపాడ లేడునిన్ను సంతోషంగా కానీ దుఃఖంతో కానీ ఉంచేది నీ మ నసే. దానిని అదుపు చేసుకో, దానికి నచ్చ



చెప్పు. దాని మా ట నీవు వినడం కాదు, నీ మా ట అది వినేటట్లు చేసుకో. అ ది నీ చేతిలో ఉంది. అది ఇత రుల వల్ల సాధ్యం కాదు.అలా ఆలోచించి నిత్యం తృప్తిగా,సం తోషంగా ఉంటూ పనులుచక్క బెట్టుకుం టుంటే అదేనీకు స్వర్గం మీకొక రహస్యం చెబుతా మనం అందరం చెప్పుకునే స్వర్గలో కం శాశ్వతం కాదు మనం చేసి న మంచి పనుల వల్ల మనం స్వర్గం చేరుకునేది నిజమేఅయి నా అది మన ఖాతాలో పుణ్యం ఉన్నంతవరకేఅది అయిపోగా నే మనం పడిపోతాం. కానీఇక్క డ ఈ మనుష్య జన్మనీ కుదక్కిం ది,84 లక్షల జీవరాశుల్లో దేని కీ దక్కని అదృష్టం వల్ల నీకు దక్కిన ఈ జన్మ సార్థకం చేసు కోవాలంటే నీవు దొరికిన దాని తో తృప్తిపడి నిత్యం సంతోషం గా ఉంటేనీ జీవితాంతం అలా ఉండగ లిగితే ఇక్కడే నీకు స్వ ర్గ సుఖాలు లభించినట్లు.అలా కాక నా స్నేహి తుడు మంచి మార్కులతో ఉత్తీర్ణుడవు తు న్నాడు, నేను కాలేకపోతున్నాఅని తలుచుకుంటూ నువ్వు ఏడుస్తూ కూర్చుంటే నీ నర కాన్ని దేముడు కాకుండా నీవే సృష్టించు కున్నట్లయింది. జన్మజన్మల కూ నీవు కూడా సంతోషంగా ఉండాలంటే, నీకు కూడా నీ స్నేహితుడి లాగా సరస్వతీకటాక్షం పొందాలంటే.. కష్టపడు, బాగా చదువు.ఈ జన్మలో నీకు వచ్చిన విద్య వది మందికి పంచు, కష్టంలో ఉన్నవాడికి నీకు చేతన యినంత సహాయం చెయ్యి. నిత్యో త్సాహంతో ఉండు. ఫెయిల్ అయ్యావు.అంత మాత్రానికే లోకం తల్ల కిందులయిపోయినంతగాది గాలు పడొద్దు అబ్దు ల్ కలాంగారు.. ఎఫ్.ఎ.. ఐ.ఎల్.. ఫెయిల్ అంటే ఫస్ట్ అటెంప్ట్ ఇన్ లెర్నింగ్. అన్నారు. అంటే నీవు నేర్చుకోవడానికి నీవు చేసిన మొదటి ప్రయత్నం అది అన్నారు ఇప్పు డు నీవేం చేయా లి.. రెండో ప్రయ త్నం.పట్టుదల తో, ఏకాగ్ర తతో సాధించుమం తే తప్ప నీ అరచేతిలో నీవు సృష్టించుకోగలిగిన స్వర్గాన్ని నీవే కిందకు నెట్టేసి నరకాన్ని చేతులారా తెచ్చిపెట్టు కోవద్దు.

కరుణాపురంలో ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు

కరుణాపురం తెహెల్కా న్యూస్,అక్టోబర్ 10

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామంలో సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్ ఆధ్వర్యంలో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుక మ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతు కమ్మ పండుగ ప్రజల మధ్య ఐక్యతను పెంపొం దిస్తుందని సర్పంచ్ పేర్కొన్నారు.



బిజినెస్

రూపాయి పతనానికి చెక్ పెట్టేందుకు ఆర్‌బీఐ కీలక చర్యలు.. డాలర్ల సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు!



రూపాయి విలువ పడిపోకుండా చూసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక చర్యలు చేపట్టింది. ప్రభుత్వ రంగానికి చెందిన మూడు చమురు కంపెనీలకు అవసరమైన డాలర్లను అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ నెల 12 నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది.ఇండియన్ ఆయిల్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం కంపెనీలకు రోజూ డాలర్లు అవసరమవుతాయి. విదేశాల నుంచి ముడి చమురు కొనాలంటే డాలర్లలోనే చెల్లింపులు చేయాలి. అందుకే ఈ మూడు కంపెనీలకు అవసరమైన డాలర్లను ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా అందించాలని ఆర్‌బీఐ నిర్ణయించింది.మరోవైపు, డాలర్ల కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన లావాదేవీలపైనా ఆర్‌బీఐ కొన్ని ఆంక్షలు విధించింది. డాలర్ విలువలో వచ్చే మార్పుల వల్ల నష్టాలు రాకుండా చేసుకునేందుకు చేసే ఒప్పందాల విషయంలో ఈ నిబంధనలు వర్తిస్తాయి. ఒకే లావాదేవీకి సంబంధించి వేర్వేరు బ్యాంకుల ద్వారా రక్షణ పొందే ప్రయత్నాలను నియంత్రించనుంది. అలాగే, అసలు వ్యాపార అవసరం లేకుండా చేసే కొన్ని లావాదేవీల పరిమితిని కూడా తగ్గించింది.

జియో నుంచి ఏఐ స్మార్ట్ గ్లాసెస్.. కళ్లతోనే యూపీఐ పేమెంట్లు!



టెక్నాలజీ ప్రపంచంలో సరికొత్త సంచలనానికి రిలయన్స్ జియో తెరతీసింది. కృత్రిమ మేధ (AI)ను స్మార్ట్‌ఫోన్లకు మాత్రమే పరిమితం చేయకుండా, రోజువారీ వినియోగించే వస్తువుల్లోకి తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా ఏఐ ఆధారిత స్మార్ట్ గ్లాసెస్, ఆడియో వేరబుల్స్‌ను ఆవిష్కరించింది. ఢిల్లీలో జరుగుతున్న ఇండియా మొబైల్ కాంగ్రెస్ (IMC) 2026 వేదికగా ఈ ఉత్పత్తులను ప్రదర్శించింది. వీటిలో అత్యంత ప్రధాన ఆకర్షణగా వాయిస్ కమాండ్‌తో యూపీఐ చెల్లింపులు చేసే ఫీచర్ నిలిచింది.జియో పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన డెమోలో, ఈ టెక్నాలజీ ఎలా పనిచేస్తుందో చూపించారు. వినియోగదారులు తమ జియో స్మార్ట్ గ్లాసెస్‌తో వ్యాపారి వద్ద ఉన్న క్యూఆర్ కోడ్ వైపు చూసి, వాయిస్ కమాండ్ ద్వారా దాన్ని స్కాన్ చేయమని ఏఐ అసిస్టెంట్‌ను ఆదేశించాలి. వెంటనే ఏఐ ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, లావాదేవీని ప్రారంభిస్తుంది. డబ్బు పంపే ముందు, యూజర్ నుంచి వాయిస్ కన్ఫర్మేషన్ తీసుకున్న తర్వాతే యూపీఐ ఆధారంగా చెల్లింపు పూర్తిచేస్తుంది. అయితే, ఇది ప్రస్తుతం ప్రయోగాత్మక దశలోనే ఉందని, పూర్తిస్థాయిలో ఎప్పుడు అందుబాటులోకి వస్తుందనే వివరాలను జియో వెల్లడించలేదు. భద్రతా ప్రమాణాలు, లావాదేవీల పరిమితి వంటి సాంకేతిక అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.మరెన్నో అద్భుత ఫీచర్లు..ఈ ఏఐ గ్లాసెస్ (జియోఫ్రేమ్స్) కేవలం చెల్లింపులకే పరిమితం కాదు. వీటితో చేతుల ప్రమేయం లేకుండానే హెచ్‌డీ క్వాలిటీతో ఫొటోలు తీయవచ్చు, వీడియోలు రికార్డ్ చేయవచ్చు. అంతేకాదు, సోషల్ మీడియాలో లైవ్ స్ట్రీమింగ్ కూడా చేయవచ్చు. ప్రయాణాల్లో, షాపింగ్ సమయంలో భాషాపరమైన అడ్డంకులను తొలగించేందుకు ఈ గ్లాసెస్‌లో ప్రత్యేక ఫీచర్ ఉంది. ఇది ఏకంగా 12 భారతీయ భాషలను రియల్ టైంలో అనువదించగలదు.ఓపెన్-ఇయర్ ఆడియో టెక్నాలజీతో కాల్స్ మాట్లాడటం, సంగీతం వినడం వంటివి చేయవచ్చు. ఈ టెక్నాలజీ వల్ల బయటి పరిసరాల్లోని శబ్దాలు కూడా స్పష్టంగా వినిపిస్తాయి. “హలో జియో” అని చెప్పి వాయిస్ అసిస్టెంట్‌ను యాక్టివేట్ చేయడం ద్వారా మీటింగ్స్ షెడ్యూల్ చేయడం, టాస్క్‌లు సెట్ చేయడం, రిమైండర్లు పెట్టుకోవడం వంటి పనులు సులభంగా చేసుకోవచ్చు. విద్యార్థులకు చదువులో, పరిశోధనలో కూడా ఈ గ్లాసెస్ అసిస్టెంట్‌గా పనిచేస్తాయి. ఈ కొత్త వేరబుల్స్ అన్నీ “జియోరియాలిటీఓఎస్” అనే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌పై పనిచేస్తాయి. జియోఫ్రేమ్స్, ఆడియో ఫ్రేమ్స్, టీడబ్ల్యూఎస్ ఇయర్‌బడ్స్ అనే మూడు కేటగిరీలలో ఈ ఉత్పత్తులను తీసుకురానున్నట్లు జియో తెలిపింది. స్మార్ట్‌ఫోన్ ఆవల కృత్రిమ మేధను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలోకి తీసుకురావడమే తమ లక్ష్యమని కంపెనీ స్పష్టం చేసింది.

జియో ఐపీఓ ధరల శ్రేణి రూ.1,065-1,119?



రిలయన్స్ ఇండస్ట్రీస్ కు చెందిన టెలికాం, డిజిటల్ సేవల విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ (జేఎఫ్ఎల్).. ఈ నెలలో ప్రారంభించనున్న తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)లో షేర్లను రూ.1,065 -1,119 ధరల శ్రేణిలో ఆఫర్ చేయవచ్చని సమాచారం. ఈ ధరల శ్రేణిలో గరిష్ఠ స్థాయి ప్రకారంగా కంపెనీ రూ.30,213 కోట్లు సమీకరించనుందని.. తద్వారా దేశంలో అతిపెద్ద ఐపీఓగా అవతరించనుందని బ్లూంబర్గ్ కథనం పేర్కొంది. అంతేకాదు, ఐపీఓ ద్వారా జియో ప్లాట్‌ఫామ్స్ మార్కెట్ విలువ రూ.10.3 లక్షల కోట్ల స్థాయికి చేరనుందని తెలిపింది. అంటే, తన మాతృసంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్, టెలికాం సేవల్లో తన ప్రధాన ప్రత్యర్థి భారతీ ఎయిర్‌టెల్ తర్వాత మూడో అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా జియో అవతరించనుంది. బీఎ?సఈలో శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.15.84 లక్షల కోట్లుగా, ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ.11.27 లక్షల కోట్లుగా నమోదైంది. కాగా, జియో ఐపీఓ ఈ నెల 21న ప్రారంభమై 23న ముగియనుందని సమాచారం. 28న కంపెనీ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్ట్ చేయవచ్చు. ఐపీఓలో భాగంగా కంపెనీ పూర్తిగా తాజా ఈక్విటీ షేర్లనే జారీ చేయనుందని.. ప్రస్తుత వాటాదారులెవ్వరూ తమ వాటా షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా విక్రయించే ఆలోచనలో లేరని తెలిసింది.

స్పోర్ట్స్

కోచ్‌తో గొడవ.. జాతీయ జట్టుకు ఫుట్‌బాల్ దిగ్గజం రొనాల్డో దూరం!

పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోకు ఎదురుదెబ్బ తగిలింది. జాతీయ జట్టు శిబిరం నుంచి ముందుగానే వెళ్లిపోవడంతో పోర్చుగీస్ ఫుట్‌బాల్ సమాఖ్య (ఎఫ్‌పీఎఫ్) అతడిపై క్రమశిక్షణ చర్యలు ప్రారంభించింది. ఈ కేసును అత్యవసరంగా విచారించాలని నిర్ణయించింది. అయితే, రొనాల్డోకు ఎలాంటి శిక్ష విధించాలనే దానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.41 ఏళ్ల రొనాల్డో.. డెన్మార్క్‌తో నేషన్స్ లీగ్ మ్యాచ్‌కు ముందు జట్టు శిబిరాన్ని వీడాడు. జట్టులో తనకు ఎంతసేపు ఆడే అవకాశం ఇవ్వాలనే విషయంలో కోచ్ జార్జ్ జీసస్‌తో విభేదాలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.ఈ వ్యవహారంపై అక్టోబర్ 9న క్రమశిక్షణ విచారణ ప్రారంభించినట్లు ఎఫ్‌పీఎఫ్ తెలిపింది. తొలుత రొనాల్డోపై తాత్కాలిక సస్పెన్షన్ విధించగా, ఆ తర్వాత మరో చర్య తీసుకున్నట్లు వెల్లడించింది. విచారణ పూర్తయ్యే వరకు వివరాలను బయటపెట్టబోమని స్పష్టం చేసింది.తాను జట్టు శిబిరం నుంచి వెళ్లిపోవడంపై రొనాల్డో ఇప్పటికే సహచర ఆటగాళ్లకు, పోర్చుగల్ అభిమానులకు క్షమాపణలు చెప్పాడు. తన తప్పునకు తగిన శిక్ష విధించాలని ఫుట్‌బాల్ సమాఖ్యను కోరాడు. జట్టు కెప్టెన్ అయినంత మాత్రాన చర్యల నుంచి మినహాయింపు ఉండకూడదని స్పష్టం చేశాడు.నార్వేతో జరిగిన నేషన్స్ లీగ్ మ్యాచ్‌లో పోర్చుగల్ 2-1తో గెలిచింది. అయితే, ఆ మ్యాచ్‌లో రొనాల్డోకు ఆడే అవకాశం రాలేదు. తనకు 30 నిమిషాలు ఆడే అవకాశం ఇస్తానని కోచ్ చెప్పి, ఆ తర్వాత మాట మార్చారని రొనాల్డో ఆరోపించాడు.



అలాంటి ఒప్పందం ఏదీ లేదని కోచ్ ఖండించాడు.ఎమరోవైపు, క్లబ్ ఫుట్‌బాల్‌లో రొనాల్డో మళ్లీ సత్తా చాటాడు. అల్ నస్ర్ తరఫున దిరియా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో గోల్ చేసి, తన కెరీర్ గోల్స్ సంఖ్యను 980కి చేర్చాడు. ఈ మ్యాచ్‌లో అల్ నస్ర్ 3-0తో విజయం సాధించింది. ఇప్పుడు పోర్చుగల్ సమాఖ్య విచారణలో ఎలాంటి నిర్ణయం వస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

249 పరుగులూ సరిపోలేదా? భారత బౌలర్లకు గవాస్కర్ కీలక ప్రశ్నలు!

వెస్టిండీస్‌తో రెండో టీ20లో భారత్ భారీ స్కోరు చేసినా ఓటమి తప్పలేదు. 250 పరుగుల లక్ష్యాన్ని కరీబియన్ జట్టు మరో 9 బంతులు మిగిలుండగానే ఛేదించింది. దీంతో భారత బౌలర్ల ప్రదర్శనపై విమర్శలు మొదలయ్యాయి. దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ కూడా బౌలర్ల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇంత భారీ స్కోరును కాపాడుకోలేక పోవడానికి కారణమేంటని ప్రశ్నించాడు.భారత్ బ్యాటర్లు తమ పని సమర్థంగా చేశారని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో భారత జట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. తొలుత సంజు శాంసన్ కీలక ఇన్నింగ్స్‌తో జట్టుకు భారీ స్కోరు అందించాడు. అయితే బౌలర్లు మాత్రం ఆ ప్రదర్శనకు తగిన న్యాయం చేయలేకపోయాడు.“రెండు ఓవర్లు నెమ్మదిగా సాగిన తర్వాత భారత్ 235-240 పరుగులు చేస్తుందని అనుకున్నా. కానీ మరో 9 పరుగులు ఎక్కువే చేసింది. కాబట్టి బ్యాటర్లను తప్పుపట్టలేం. బౌలర్లు మాత్రం తమ స్థాయికి తగ్గట్లు బౌలింగ్ చేయలేదు. బౌలింగ్ కోచ్ ఏం ఆశించాడు? బౌలర్లు దానికి తగ్గట్లు బౌలింగ్ చేశారా? అన్నది ఆసక్తికరంగా ఉంటుంది” అని గవాస్కర్ వ్యాఖ్యానించారు. మరోవైపు మాజీ పేసర్ వరుణ్ ఆరోన్ కూడా భారత బౌలర్ల వ్యూహాన్ని తప్పుబట్టాడు. తొలి ఓవర్లోనే వెస్టిండీస్ రెండు వికెట్లు కోల్పోయిన తర్వాత కూడా పేసర్లతోనే ఒత్తిడి కొనసాగించాల్సిందని అన్నాడు. పవర్‌ప్లేలో నాలుగో ఓవర్‌ను అక్షర్ పటేల్‌తో వేయించడం అనవసరమని అభిప్రాయపడ్డాడు. ఆ ఓవర్లో అక్షర్ 16 పరుగులు ఇచ్చాడు. షాయ్ హోప్, రొమన్ పావెల్ కొత్త బంతిని ఎదుర్కోవడంలో ఇబ్బంది పడుతున్నప్పుడు పేసర్లతోనే నాలుగు ఓవర్లు వేయించి చాల్సిందని పేర్కొన్నారు.మ్యాచ్ ఓటమిపై భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ స్పందిస్తూ.. మంచు ప్రభావం కారణంగా ఎంత స్కోరు చేస్తే సరిపోతుందో అంచనా వేయడం కష్టమని చెప్పాడు. 249 పరుగుల లక్ష్యాన్నే వెస్టిండీస్ సులువుగా ఛేదించిందని గుర్తు చేశాడు. ఆ జట్టు కెప్టెన్ షాయ్ హోప్ 45 బంతుల్లోనే శతకం బాదగా, షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ 37 బంతుల్లో 84 పరుగులతో చెలరేగాడు. దీంతో వెస్టిండీస్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

విండీస్ చేతిలో రికార్డు ఓటమి.. అతడి బౌలింగే మ్యాచ్‌ను మార్చిందంటూ ప్రత్యర్థి బౌలర్‌పై గంభీర్ ప్రశంసలు



రాంచీ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో టీమిండియా అనూహ్య ఓటమిని చవిచూసింది. మొదట బ్యాటింగ్ చేసి 249 పరుగుల భారీ స్కోరు సాధించినప్పటికీ, దానిని కాపాడుకోవడంలో భారత బౌలర్లు విఫలమయ్యారు. మ్యాచ్ అనంతరం టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్ మీడియాతో మాట్లాడుతూ, జట్టు ఓటమిపై బాధ్యత తీసుకున్నాడు. ఈ సందర్భంగా ప్రత్యర్థి జట్టు బౌలర్ రోస్టన్ చేజ్‌పై ప్రశంసల వర్షం కురిపించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.“మ్యాచ్ సందర్భాన్ని బట్టి చూస్తే, రోస్టన్ చేజ్ వేసిన స్పెల్ ఒక గేమ్ ఛేంజింగ్, మ్యాచ్ విన్నింగ్ స్పెల్. ఈ వికెట్‌పై అతను తన లైన్‌ను మార్చిన విధానం అద్భుతం. ఒకే లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేస్తే బ్యాటర్లు కుదురుకుంటారు. కానీ, చేజ్ అలా చేయలేదు. బ్యాటర్ల కాళ్లపైకి, వైడ్‌గా, ఫుల్ లెంగ్త్‌లో బంతులు వేస్తూ తన వ్యూహాన్ని మార్చాడు. ఇలాంటి వికెట్లపై ఆ వైవిధ్యమే చాలా ముఖ్యం” అని గంభీర్ విశ్లేషించాడు. ఈ మ్యాచ్‌లో చేజ్ 3/24 గణాంకాలతో అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శివమ్ దూబేవంటి కీలక వికెట్లను పడగొట్టి భారత స్కోరు వేగానికి కళ్లెం వేశాడు. భారత ఇన్నింగ్స్‌లో సంజూ శాంసన్ (82), శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ మెరుపులతో జట్టు 5 వికెట్లకు 249 పరుగులు చేసింది. అయితే, వెస్టిండీస్ బ్యాటర్లు షాయ్ హోప్ (102 నాటౌట్), షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (84) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో కేవలం 18.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించారు. ఈ క్రమంలో మయాంక్ యాదవ్ ఒక కీలక క్యాచ్ జారవిడవడంపై గంభీర్ స్పందిస్తూ.. “టాస్ మన చేతుల్లో ఉండదు. క్యాచ్‌లు డ్రాప్ అవుతుంటాయి. గతంలో జరిగాయి, భవిష్యత్తులోనూ జరుగుతాయి. ఎవరూ కావాలని క్యాచ్ వదిలేయరు. కాబట్టి దాని కోసం ఎవరినీ నిందించలేం” అని అన్నాడు.

చనిపోయినా వదలట్లేదు.. అసలు నానా పటేకర్‌తో తనూశ్రీ దత్తా వివాదం ఏంటి?





బాలీవుడ్ సీనియర్ నటుడు నానా పటేకర్ మరణం తర్వాత నటి తనూశ్రీ దత్తా చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. నానా పటేకర్‌ను ఉద్దేశించి ఆమె 'ఈవిల్ డెడ్' అంటూ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చినా తనూశ్రీ వెనక్కి తగ్గలేదు. తన వ్యాఖ్యలను సమర్థించుకుంది. ఇంతకీ వీరిద్దరి మధ్య వివాదం ఎక్కడ మొదలైంది? 2008లో జరిగిన ఓ సినిమా షూటింగ్ సమయంలో అసలేం జరిగింది? 2004లో ఫెమినా మిస్ ఇండియా యూనివర్స్ కిరీటాన్ని గెలుచుకున్న తనూశ్రీ దత్తా.. అదే ఏడాది మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఆ తర్వాత 2005లో 'ఆషిక్ బనాయా ఆప్నే' సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. చాక్లెట్, భాగమ్ భాగ్, ఢోల్, గుడ్ బాయ్ బ్యాడ్ బాయ్ వంటి సినిమాల్లో నటించింది. నానా పటేకర్, తనూశ్రీ దత్తా 2008లో వచ్చిన 'హార్న్ ఓకే ప్లీజ్' సినిమాలో కలిసి పనిచేశారు. ఆ సినిమా షూటింగ్ సమయంలోనే వీరిద్దరి మధ్య వివాదం మొదలైంది. ఆ సినిమాలో ఓ ప్రత్యేక పాట చిత్రీకరణ సందర్భంగా నానా పటేకర్ తనతో అనుచితంగా ప్రవర్తించారని తనూశ్రీ ఆరోపించింది. ఆ సమయంలో ఆయన ప్రవర్తన తనను ఇబ్బందికి గురిచేసిందని తెలిపింది. ఆ ఘటన గురించి 2018లో మరోసారి బహిరంగంగా మాట్లాడటంతో ఈ వివాదం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. 2018 సెప్టెంబరులో తనూశ్రీ చేసిన ఆరోపణలు అప్పట్లో 'మీటూ' ఉద్యమంలో కీలకంగా మారాయి. పాట చిత్రీకరణలో తనతో పాటు మరో నటుడు మాత్రమే ఉండాల్సి ఉండగా.. నానా పటేకర్ కూడా సన్నిహితంగా ఉండే నృత్య కదలికల్లో పాల్గొనాలని కోరుకున్నారని ఆమె ఆరోపించింది. దీనిపై తాను అభ్యంతరం తెలిపినట్లు చెప్పింది. అయితే తనూశ్రీ ఆరోపణలను నానా పటేకర్ ఖండించారు. అవి అసత్యమని పేర్కొన్నారు. ఈ వివాదం తర్వాత సినీ, టీవీ ఆర్టిస్టుల సంఘం (సింటా) స్పందించింది. మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) సహా పలువురు ఈ వివాదంలోకి వచ్చారు. తనూశ్రీ ఫిర్యాదు తర్వాత ముంబయి పోలీసులు నానా పటేకర్‌పై కేసు నమోదు చేశారు. అయితే ఆయన తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. మరోవైపు ఫిర్యాదులోని అంశాలపై చట్టపరమైన గడువు ముగిసిందని, ఆధారాల కొరత కారణంగా కేసును ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం లేదని కోర్టు నిర్ణయించింది.

హీరోయిన్ల దుస్తులు, శరీరంపై కామెంట్స్ తీవ్రంగా స్పందించిన మృణాల్

బాలీవుడ్ నటీనటులపై, ముఖ్యంగా హీరోయిన్ల వ్యక్తిగత జీవితాలు, దుస్తులు, శరీరాకృతిని లక్ష్యంగా చేసుకుని పెరుగుతున్న ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై నటి మృణాల్ ఠాకూర్ తీవ్రంగా స్పందించారు. తోటి నటీమణులు కత్రినా కైఫ్, కృతి సనన్‌లకు ఆమె బాసటగా నిలిచారు. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని ఇష్టానుసారం జీవించే హక్కు ఉంటుందని, ఇతరుల వ్యక్తిగత ఎంపికలను విమర్శించే అధికారం ఎవరికీ లేదని ఆమె స్పష్టం చేశారు.ఇటీవల తన 'పూజా మేరీ జాన్' సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మృణాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రసవానంతర శారీరక మార్పుల కారణంగా కత్రినా కైఫ్ బాడీ షేమింగ్‌కు గురికావడం, ఒక జువెలరీ యాడ్ లో ధరించిన దుస్తుల కారణంగా కృతి సనన్ విమర్శలు ఎదుర్కోవడం వంటి సంఘటనల నేపథ్యంలో ఆమె స్పందించారు. కత్రినా, కృతి ఇద్దరూ సినిమా రంగానికి ఎంతో సేవ చేశారని, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని గుర్తుచేశారు. "ప్రతి విషయ ంలోనూ తప్పులు వెతకడం మానుకోవాలి. సోషల్ మీడియాలో కొందరి ప్రవర్తన చూస్తు ంటే పిచ్చి పట్టినట్లుంది" అని ఆమె ఘాటుగా వ్యాఖ్యాని ంచారు. వారి కృషిని, విజయాన్ని మరిచి పోయి చిన్న విషయాలపై దృష్టి పెట్టడం సరికాదన్నారు. ఒకప్పుడు మహిళలను మాత్ర మే ఎక్కువగా విమర్శిం చేవారని, కానీ ఇప్పుడు పురుషులు కూడా ఇలాంటివి ఎదుర్కొం టున్నారని మృణాల్ పేర్కొన్నారు. కాగా, విమర్శల నేపథ్యంలో కృతి సనన్ నటిం చిన జువెలరీ ప్రకటనను సంబంధిత సంస్థ ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే.



అందుకే 'బాషా 2'కి నో చెప్పా 'జైలర్ 2'కు ఓకే చెప్పా: రజనీకాంత్

సూపర్‌స్టార్ రజనీకాంత్ సాధారణంగా సీక్వెల్ సినిమాలకు దూరంగా ఉంటారు. గతంలో 'బాషా 2', 'పేట 2' చిత్రాల ఆఫర్లను కూడా తిరస్కరించారు. కానీ 'జైలర్ 2' విషయంలో మాత్రం వెంటనే అంగీకరించారు. ఎందుకలా? కేవలం సినిమా విజయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకోలేదని రజనీకాంత్ చెప్పారు. కథలోనే రెండో భాగానికి బలమైన పునాది ఉండటంతో ఓకే చెప్పానని వెల్లడించారు. 'జైలర్ 2' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయన ఈ విషయాలను పంచుకున్నారు. సాధాం ణంగా మొదటి భాగంలోని కథకు కొన్ని కొత్త అంశాలు జోడించి రెండో భాగాన్ని తెరకెక్కిస్తారని తాను భావిస్తానని రజనీ తెలిపారు. అందుకే సీక్వెల్స్‌పై పెద్దగా ఆసక్తి చూపనని చెప్పారు. గతంలో 'బాషా 2'కి అంగీకరిం శలేదని, విజయ్ సేతుపతి పాత్రను కొనసాగిస్తూ 'పేట 2' తీయాలన్న దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు ప్రతిపాదనను కూడా తిరస్కరించానని గుర్తు చేసుకున్నారు.'జైలర్' క్లైమాక్స్ కారణం! 'జైలర్' సినిమా ఓటీటీలో విడుదలైన తర్వాత మరోసారి చూశానని రజనీకాంత్ చెప్పారు. అప్పుడు సీక్వెల్ ఆలోచనపై తన అభిప్రాయం మారిందన్నారు. క్లైమాక్స్‌లో విగ్రహాల స్మగ్లర్ వర్మ చనిపోయే ముందు జైలర్ ముత్తువేల్ పాండియన్‌ను ఓ పెద్ద నెట్‌వర్క్ గురించి హెచ్చరిస్తాడు. ఆ నెట్‌వర్క్ గురించి సినిమా అంతటా దర్శకుడు నెల్సన్ చిన్నచిన్న సంకేతాలు ఇచ్చాడని రజనీ వివరించారు. అంతేకాదు.. రూ.వేల కోట్ల విలువైన మూడు కంటైనర్లు జైలర్ దగ్గర ఉండటం, నాగ్‌పూర్ జైలులో పనిచేసిన సమయంలోనే కరుడుగట్టిన రౌడీలు, దాదాల్లో ముత్తువేల్ పాండియన్‌పై భయం, గౌరవం ఉండటం వంటి అంశాలు రెండో భాగానికి సహజమైన పునాదిగా అనిపించాయని చెప్పారు. ఈ అంశాలన్నీ గుర్తించిన తర్వాత తానే దర్శకుడు నెల్సన్‌కు ఫోన్ చేసి 'జైలర్ 2'కి అంగీకరించినట్లు రజనీకాంత్ వెల్లడించారు. కేవలం కమర్షియల్ విజయాన్ని ఆశించి కాకుండా, కథకు కొనసాగింపు ఉండటమే తన నిర్ణయానికి కారణమని స్పష్టం చేశారు.



PRINTED ,PUBLISHED ,OWNED BY TEHELKA MEDIA NETWORK ,DIGITAL NEWS .Regd no:2019/28814, EDITOR :K.CHANDRA SHEKHAR, EXECUTIVE EDITOR :K.SRINIVAS RAO, G6 MES Colony, Alwal , Secunderabad -500010.e-mail:Tehelkamedianetworks@gmail.com